# విద్యార్థి వెలుగు

Volume VIII - Issue XI - Nov 2025



సత్యాన్వేషణ

# నిజమైన సత్యం

ప్రాచీన గ్రీకు తత్వవేత్త సోక్రటీస్ తన కాలంలో ప్రబలమైన అజ్ఞానాన్ని, అబద్ధపు బోధలను ప్రశ్నిస్తూ, "మీకు ఏమీ తెలియని దాన్ని తెలుసుకోవడమే నిజమైన జ్ఞానం" అని చాటి, చివరికి సత్యాన్ని వెలికి తీయడం కోసం తన ప్రాణాలనే అర్పించాడు. బైబిల్‌లో కూడా, బెరయ పట్టణస్థులు అపొస్తలుడైన పౌలు చెప్పిన వాక్యములను కేవలం విని ఊరుకోక, "ఆలాగున్నవో లేవో అని ప్రతి దినమును లేఖనములను పరిశోధించుచు" (అపొ.కార్య. 17:11) సత్యాన్వేషణలో మనకు ఉదాహరణగా నిలిచారు. ఈ సత్యాన్వేషణ మానవుని అంతర్గతమైన జిజ్ఞాసకు, జీవన గమ్యాన్ని అర్థం చేసుకోవాలనే తపనకు నిదర్శనం.

ప్రపంచం అసంఖ్యాకమైన సమాచారంతో, పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాలతో నిండిపోయిన ఈ తరుణంలో, అసలైన సత్యం ఏమిటి? దానిని ఎలా కనుగొనాలి? అనే ప్రశ్న ప్రతి విశ్వాసిని కలచివేస్తుంది. కొంతమంది జ్ఞానం కోసం శాస్త్రంలో, మరికొందరు ఆనందం కోసం సంపదలో, ఇంకొందరు అధికారం కోసం రాజకీయాల్లో సత్యాన్ని వెదుకుతున్నారు. కానీ ఈ లోకసంబంధమైన అన్వేషణలన్నీ తాత్కాలికమైన ఆనందాన్ని, అశాశ్వతమైన తృప్తిని మాత్రమే ఇస్తాయి. ఎందుకంటే, నిజమైన, నిత్యమైన సత్యం కేవలం దేవునిలోనే ఉంది. "నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప ఎవడును తండ్రియొద్దకు రాడు" (యోహాను 14:6) అని ప్రభువైన యేసుక్రీస్తు స్పష్టంగా ప్రకటించాడు. ఆయన బోధనలే మనకు అచంచలమైన సత్యానికి మూలం.

సత్యాన్ని అన్వేషించేవారు ప్రపంచ మాయనుండి, తాత్కాలిక ఆశలనుండి తమ మనస్సులను విముక్తి చేసుకోవాలి. నేడు ఎన్నో అబద్ధపు బోధలు, మానవ కల్పిత సిద్ధాంతాలు, క్షణికావేశపు నినాదాలు సత్యం మాస్కు ధరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులలో, సత్యాన్ని గుర్తించే వివేకాన్ని పరిశుద్ధాత్మ ద్వారా మనం పొందాలి. ప్రతిరోజు దేవుని వాక్యాన్ని ధ్యానించడం, ప్రార్థనలో దేవునితో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉండటం, సహ విశ్వాసులతో ఐక్యతలో జీవించడం ద్వారానే మనం సత్యాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోగలం. "దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించు టకును, ఖండించుటకును, తప్పుద్దిదుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:16) అని బైబిలు బోధిస్తుంది. కాబట్టి, సత్యాన్ని కనుగొనడానికి దేవుని వాక్యమే మనకు ప్రామాణికం.

ఒక విశ్వాసిగా సత్యాన్వేషణ అంటే కేవలం జ్ఞానార్జనే కాదు, ఆ సత్యాన్ని జీవితంలో ఆచరించడం కూడా. సత్యాన్ని తెలుసుకోవడం మనకు స్వేచ్ఛను ఇస్తుంది. "సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 8:32) అని బైబిలు చెప్తుంది. ఈ స్వేచ్ఛ పాపబంధకాల నుండి, లోకబంధకాల నుండి విడుదలనిస్తుంది. సత్యాన్ని అనుసరించడం అంత సులభం కాదు. దాని కోసం లోకానికి వ్యతిరేకంగా నిలబడాల్సి వస్తుంది, త్యాగాలు చేయాల్సి వస్తుంది. అయితే, పరిశుద్ధాత్మ దేవుడు మనకు తోడుగా ఉండి సర్వసత్యములోనికి నడిపిస్తాడు (యోహాను 16:13). ఆయన ద్వారా మనం దేవుని చిత్తాన్ని, ఆయన మార్గాలను స్పష్టంగా అర్థం చేసుకోగలం.

కాబట్టి, మన జీవిత ప్రయాణంలో దేవుని వాక్యాన్నే మన పాదాలకు దీపంగా, మన త్రోవకు వెలుగుగా చేసుకుందాం. లోకం అందించే ప్రతి సిద్ధాంతాన్ని, ప్రతి వాదాన్ని వాక్యపు గీటురాయిపై పరీక్షిద్దాం. నిత్యజీవమును, శాశ్వతమైన ఆనందాన్ని అందించే నిజమైన సత్యం యేసుక్రీస్తులోనే ఉందని గుర్తించి, ఆ సత్యానికి మన జీవితాలను అంకితం చేద్దాం. మన పరిశోధనలో, మన అన్వేషణలో, మన గురువుగా ప్రభువైన యేసుక్రీస్తును, మన మార్గదర్శిగా పరిశుద్ధ గ్రంథాన్ని, మన సహకారిగా పరిశుద్ధాత్మను కలిగి ఉందాం. అప్పుడే మనం నిజమైన జ్ఞానాన్ని, నిత్యమైన ఆనందాన్ని అనుభవించగలం.

– కె. జాన్ భూషణం

# విద్యార్థి వెలుగు

Vol. VIII - Issue XI - Nov 2025

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH

**EDITORIAL BOARD**

Editor and Publisher:
Mr. Dasari Rajesh, Hyderabad

Managing Editor:
Mr. K. John Bhushanam, Cyberabad

UESI PT TG Branch Sec.:
Mr.V Rajendra Prasad, Hyderabad

**Members:**
Mr. S. Jayaraju, Hyderabad
Mr. Raja Sekhar Addanki, Cyberabad
Mrs. V. Lilly Thedora, Hyderabad
Dr. Yerranna Boggula, Medchal Malkajgiri
Mrs. B.Lily Agnes, Mancherial
Dr. S. John Sukumar, Nizamabad
Ms. U. Catherine Chelsea, Hyderabad

**CONTACT DETAILS**

The Editor, Vidyarthi Velugu
UESI Publication Trust - Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village,
Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Ph: 9491595765
Email: editorvv2018@gmail.com

**SCAN THE QR CODE TO SUBSCRIBE VIDYARTHI VELUGU MAGAZINE**

SCAN ME

**Annual (Hard+Soft copy)**
Students -150/-
Graduates - 300/-

**For 3 Years (Hard+Soft copy)**
Students - 450/-
Graduates - 900/-

**Life (10 Years - Hard+Soft copy)**
Students & Graduates - 2000/-

**Overseas (10 Years - Soft copy)**
Students & Graduates - 2000/-

**Publication Trust Account**

Name - UESI PUBLICATION TRUST
Bank - Canara Bank
A/C No - **0624101037187**
Branch - Pragathinagar
IFSC code - CNRB0004173

Kindly inform the office after depositing amount.
Ph. **8985482388**

**Please furnish the following details**

Address, Pincode, Phone Number, Mail Id, Payment Transaction Details

**THEMES:**

Dec - Light in Darkness
Jan - New Beginnings

Please send your writeups on or before **10th of every month** to editorvv2018@gmail.com

## పాఠకుల స్పందన ...

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు మనవి. ప్రతినెల వివిలో వచ్చే ఆర్టికల్స్ మీద మీ సూచనలను, నేర్చుకున్న విషయాలు **పాఠకుల స్పందన ...** కు editorvv2018@gmail.com లేక 9491595765 (వాట్సాప్) ద్వారా పంపించగలరు.

## విషయ సూచిక

| | |
|---|---|
| సత్యాన్వేషణ | 4 |
| దేవుని మనసులోని న్యాయం | 10 |
| దేవుడు లేని నైతికత సాధ్యమేనా? | 14 |
| రాబోయే తుఫాను | 18 |
| లేయా | 21 |
| డాక్టర్ సుసీ రిజ్‌హార్ట్ | 25 |
| నెక్స్ట్ లెవెల్ | 29 |

## విజ్ఞప్తి

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు రక్షకుడు, ప్రభువునైన యేసుక్రీస్తు నామములో శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ క్రింది విషయాలు గమనించాలని కోరుతున్నాము.

1. అడ్రస్ మారినా, మ్యాగజైన్ రాకపోయినా, నూతన సబ్‌స్క్రిప్షన్, రెన్యువల్ కొరకు ఆఫీస్ స్టాఫ్ బ్రదర్ డి.సాయి కుమార్ (79933 97630) ను సంప్రదించగలరు.
2. విద్యార్థి వెలుగు పోస్టల్ అవాంతరాలు లేకుండునట్లు, అందరూ చదివి ఆత్మీయ మేలు పొందేటట్లు భారంగా ప్రార్థించండి, ప్రోత్సహించండి.

**ప్రతి నెల ప్రార్థనాంశాలు 10వ తారీఖు లోపల ఇ.యు, ఇ.జి.యఫ్‌కు చెందిన ప్రాముఖ్యమైన రెండు స్తుతి మరియు రెండు ప్రార్థనాంశాలను మాత్రమే వివి ప్రేయర్ పాయింట్స్ లింక్ ద్వారా పంపించగలరు. రచనపై ఆసక్తి కలిగిన వారు తమ వ్యాసములు, కథలు, కవితలు** editorvv2018@gmail.com **కు పంపించగలరు.**

– ఎడిటోరియల్ బోర్డ్




# సత్యాన్వేషణ

## క్యాంపస్‌లో విశ్వాస సంభాషణలు

నిర్మల మధ్యప్రదేశ్‌లోని ఒక పేరుపొందిన లా కాలేజీలో న్యాయశాస్త్రం చదువుకుంటోంది. లాయర్ అయి, కోర్టులో అమాయకులను కాపాడటం తన చిన్ననాటి కల. ఆమె న్యాయశాస్త్రానికి సంబంధించిన పుస్తకాలు, వ్యాసాలు చాలా చదివింది. లాయర్ ఎలా అవ్వాలి అనే వీడియోలు కూడా చాలా చూసింది. ఆమె ఒక మంచి, విద్యావంతులైన హిందూ కుటుంబంలో పెరిగింది. ఆ కుటుంబం నుండి ఆమె చాలా స్ఫూర్తి పొందింది.

తల్లిదండ్రుల నుండి దూరంగా, ఒక సంవత్సరం పైగా కాలేజీలో ఉన్న నిర్మలకి కొత్త అనుభవాలు ఎదురయ్యాయి. ఆమె క్లాస్‌మేట్స్‌కి వేర్వేరు నమ్మకాలు ఉండేవి. అవి ఆమె ఆలోచనలను సవాలు చేశాయి. ఈ మధ్య ఆమెను ఒక ప్రశ్న చాలా వేధించడం మొదలుపెట్టింది. అదే, లోకంలో ఈ దుష్టత్వం ఎందుకు ఉంది? మంచి దేవుడు ఉంటే ఇదంతా ఎందుకు అనుమతిస్తాడు?

వరదల్లో తన కజిన్ సోదరుడిని కోల్పోయింది. గుజరాత్‌లో జరిగిన విమాన ప్రమాదంలో తన మామయ్య మరణించారు. ఇది ఆమె కుటుంబాన్ని బాగా బాధపెట్టింది. న్యాయం కోసం పోరాడటానికి పేదవారు మంచి లాయర్‌ని పెట్టుకోలేకపోవడం ఆమెను చాలా ఆశ్చర్యపరిచింది. ఒక మంచి దేవుడు ఉంటే, ఈ భయంకరమైన దుష్టత్వాన్ని ఆయన అనుమతించకూడదు అని నిర్మల గట్టిగా అనుకుంది. అసలు దేవుడు ఉన్నాడా అని కూడా ఆమెకు సందేహం వచ్చింది.

ఇలాంటి ఆలోచనలు తన మనస్సులో అలజడి సృష్టిస్తున్న దినాలలో ఒకరోజు కాలేజిలో తన ఫ్రెండ్ జెస్లిన్ అటుగా వచ్చింది.

**జెస్లిన్:** హాయ్ నిర్మలా! ఈ ఎలా ఉన్నావు? నిన్ను కాలేజిలో చూసి మూడు రోజులవుతుంది. నీకు టెక్ట్స్ కూడా చేశాను. కానీ నువ్వు రిప్లై ఇవ్వలేదు. నీ ఆరోగ్యం అంతా బాగానే ఉంది కదా?

**నిర్మల:** ఆ, ఈ మధ్య కొంచెం మనసు బాలేదు. చాలా విషయాలు నన్ను కలవర పెడుతున్నాయి. అందుకే ఎవరితోనూ మాట్లాడాలనిపించలేదు.

జెస్లిన్: అవును, మాట్లాడుకుందామా? ఇప్పుడు మంచి సమయం కూడా. ఈరోజు లెక్చరర్ రాలేదు కాబట్టి క్లాస్ కూడా క్యాన్సిల్ అయింది. క్రిమినల్ లా క్లాసెస్ కొన్నిసార్లు అర్థం చేసుకోవడం కష్టమే కదా. కూల్! ఇప్పుడు మనకు 40 నిమిషాల బ్రేక్ దొరికింది.

**నిర్మల:** ఓహ్! అది చాలా మంచి విషయం. నేను చాలా రోజుల నుండి ఒక విషయం ఆలోచిస్తున్నాను. నీ పేరెంట్స్ ఇద్దరూ నిన్ను వదిలేశారు కదా. పెంపుడు తల్లిదండ్రుల దగ్గర ఉండాల్సి వచ్చింది. నీ సవతి తల్లిదండ్రులు కూడా నిన్ను వాళ్ళ సొంత పిల్లల్లా చూడరు కదా. నీకు బాధగా ఉండదా? నువ్వు ఎప్పుడూ ఇంత సంతోషంగా ఎలా ఉండగలుగుతున్నావు?

నేను నమ్మలేను జెస్లిన్. మంచి దేవుడు ఇలాంటి కష్టాన్ని ఎవరి జీవితంలోనూ ఉంచడు. ముఖ్యంగా నీలాంటి మంచి వ్యక్తికి ఇలా జరగడం అన్యాయం అనిపిస్తుంది. ఇంత చెడును దేవుడు ఎలా అనుమతిస్తాడు? అసలు మంచి దేవుడు ఉన్నాడా? అనిపిస్తుంది.

**జెస్లిన్:** ఇది చాలా మంచి ప్రశ్న. నిజం చెప్పాలంటే, నా జీవితంలో కూడా కొన్ని సమయాలలో చాలా బాధాకరంగా ఉంది. అయినా, నా బాధకు నేను దేవుని ఎప్పుడూ తప్పు పట్టను.

**నిర్మల:** కానీ... అది ఎలా సాధ్యం? మా మామయ్య గురించి ఒక్కసారి ఆలోచించు. ఆయన ఉద్యోగం కోసం యూకే వెళ్తున్నాడు. కానీ మధ్యలో ఆయన ఒక విమాన ప్రమాదంలో చనిపోయాడు. ఆయనకు ఏడేళ్లు, తొమ్మిదేళ్లు ఉన్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ లోకంలో చిన్న పిల్లలను కూడా రేప్ చేస్తున్నారు. పసిబిడ్డలకు కేన్సర్ వస్తుంది. మంచి దేవుడు ఎందుకు ఇంత చెడును, ఇంత బాధను అనుమతించాలి? ఎక్కడో కూర్చుని విశ్రాంతి తీసుకునే దేవుడిపై నాకు నమ్మకం పోతోంది.

**జెస్లిన్:** నీ బాధ నాకు అర్థమవుతుంది. ఈ పరిస్థితులు నిజంగా నిరాశగా, బాధాకరంగా ఉంటాయి. నిజానికి, దేవుడు మానవ బాధను ఎందుకు అనుమతిస్తున్నాడో నాకు సరిగ్గా తెలియదు. అయితే, ముఖ్యమైన విషయం ఒకటి నాకు తెలుసు. దేవుడు నిన్ను, నన్ను ఒక ఉద్దేశంతో సృష్టించాడు. అంతేకాక, మనకు 'ఫ్రీ విల్' ఇచ్చాడు. మనం మంచిని లేదా చెడును ఎంచుకోవచ్చు.

మానవుడు మొదట్లో అనేక తప్పులు చేశాడు. అందుకే మనం ఈ వినాశనమైన లోకంలో జీవిస్తున్నాము. మనం "దేవుడు సర్వశక్తిమంతుడు" అని అంటాము కదా? అంటే, ఈ లోకంలో జరిగే ప్రతిదీ దేవుని సంపూర్ణమైన ఇష్టం అని కాదు. ఆయనకు సర్వశక్తి ఉన్నా, మనకు 'ఫ్రీ విల్' ఇవ్వడం ద్వారా, ఆయన తన శక్తిని తానే పరిమితం చేసుకున్నాడు.

ఉదాహరణకు, మన క్లాస్‌మేట్ అనుష్క దగ్గరకు

నేను వెళ్లాను అనుకో. నేను ఆమె చెంప మీద గట్టిగా కొట్టాను. తర్వాత నేను, "దేవుడే నన్ను అలా చేయమన్నాడు" అని చెప్తే, నేను అబద్ధం చెప్పినట్లే. దేవుడు నా చేతులను ఒక మంచి ఉద్దేశం కోసం సృష్టించాడు. కానీ నేను ఆ ఉద్దేశాన్ని దుర్వినియోగం చేశాను. దాని అర్థం ఏంటంటే... నేను నా 'ఫ్రీ విల్' ని తప్పుగా వాడాను. అంతేతప్ప, దేవుడు చెడ్డవాడు అని కాదు.

**నిర్మల:** నువ్వు చెప్పదలుచుకున్నది ఏంటంటే, మన 'ఫ్రీ విల్' ని దుర్వినియోగం చేయడం వల్లే దేవుడు చెడును అనుమతిస్తున్నాడని అంటావా? నాకు పూర్తిగా అర్థం కాలేదు. కానీ, అవును, ఈ 'ఫ్రీ విల్' లేకపోతే, మన లోకం చాలా బోరింగ్‌గా, రోబోల్లాగా ఉండేది. అది నాకు అర్థమవుతోంది. నువ్వు ఒకసారి చెప్పావు కదా, నైతికత (మంచి–చెడు) దేవుడి నుండే వస్తుంది అని. మరి ఆ నియమాలను దేవుడే రాస్తే, ఆయన మంచివాడని మనకెలా తెలుస్తుంది?

**జెస్లిన్:** దేవుడు, దేవుడు కావాలంటే, ఆయన స్వభావరీత్యా మంచివాడై ఉండాలి. ఆయన స్వభావమే నీతిని నిర్వచిస్తుంది. ఆ స్వభావం నుండి ఏ కొంచెమైనా పక్కకు తొలగితే అదే చెడు. ఒకవేళ దేవునికి ఈ స్వభావం లేకపోతే, మనకు బయట ఎలాంటి నీతి ప్రమాణం ఉండదు. మనం దేనికీ విధేయత చూపాల్సిన అవసరం కూడా ఉండదు.

ఉదాహరణకు, ఒక తండ్రి తన కొడుక్కి చిన్నతనం నుండీ మంచి, చెడు గురించి నేర్పించాడు అనుకుందాం. ఆ అబ్బాయి పెద్దవాడై, టీనేజర్‌గా మారినప్పుడు, తన తల్లిదండ్రులను ధిక్కరించి, వ్యభిచారిగా జీవించాలని స్వయంగా నిర్ణయించుకున్నాడు. కొడుకు చేసిన ఈ పని వల్ల ఆ తండ్రి మంచివాడు కాదని అర్థమా? కొడుకు అవిధేయత, 'ఫ్రీ విల్' దుర్వినియోగం చేయడం అనేవి ఆ తండ్రి మంచితనాన్ని నిర్ణయిస్తాయా?

**నిర్మల:** అస్సలు కాదు! నువ్వు నాకు కొత్త విషయాలు తెలియజేస్తున్నావు. నేను ఇంతకుముందు ఇలాంటి విషయాల గురించి ఆలోచించనే లేదు.

అంటే, దేవుడు స్వతహాగా చెడ్డవాడు కాదు. ఆయనకు చెడు ఆలోచనలు అస్సలు ఉండవు. నేను హిందువుగా పెరిగాను. ఇప్పటికీ నేను హిందువునే. అన్ని మతాలు దేవుని దగ్గరకు చేరుస్తాయని నేను గట్టిగా నమ్ముతాను. అన్ని దేవుళ్లు ఒక్కటే అని కూడా నమ్ముతాను. దీని గురించి నువ్వేమంటావు?

**జెస్లిన్:** సత్యాన్ని తెలుసుకోవాలని, దేవునితో బలమైన సంబంధం కలిగి ఉండాలని నువ్వు చాలా కోరుకుంటున్నావు. అది నాకు నిజంగా సంతోషంగా ఉంది.

మతం అనేది ఒక వ్యవస్థ లేదా ఒక అత్యున్నత శక్తిపై కేంద్రీకృతమై ఉన్న నమ్మకాల సమూహం. నేను ఒక క్రైస్తవురాలిని కదా. దీనికి నా దగ్గర ఒక తార్కికమైన జవాబు ఉంది. అలాగే ఒక క్రైస్తవ జవాబు కూడా ఉంది. నీకు ఏది కావాలి?

**నిర్మల:** తార్కికమైన జవాబుతోనే మొదలుపెడదాం.

**జెస్లిన్:** ఖచ్చితంగా. వివిధ మతాలలో దేవుని గురించిన కొన్ని అభిప్రాయాలు ఇవి:

* **మోనోథియిజం (Monotheism):** ఒకే దేవుడు ఉన్నాడు. ఆయన సృష్టిలో వ్యక్తిగతంగా పాల్గొంటాడు.
* **పాలిథియిజం (Polytheism):** చాలా మంది దేవతలు ఉంటారు. వీరు కొన్నిసార్లు

ప్రపంచంలో జోక్యం చేసుకుంటారు, కొన్నిసార్లు చేసుకోరు.

* **పాంథియిజం (Pantheism):** దేవుడే ఈ విశ్వం.
* **డీయిజం (Deism):** ఒక గొప్ప సృష్టికర్త ఉన్నాడు. కానీ ఆయన సృష్టిని చేసిన తర్వాత, దానిలో జోక్యం చేసుకోడు.
* **అగ్నాస్టిసిజం (Agnosticism):** దేవుడు ఉన్నాడో లేదో ఖచ్చితంగా తెలియదు అని నమ్ముతారు.
* **ఎథియిజం (Atheism):** దేవుడు అసలు లేనే లేడు అని నమ్ముతారు.
* **సింక్రెటిజం (Syncretism):** వేర్వేరు నమ్మకాలను కలిపి, ఒక కొత్త నమ్మకాన్ని ఏర్పరచుకుంటారు.

దేవుని గురించిన ప్రధానమైన అభిప్రాయమే మతాల మధ్య మారుతుంది. అలాంటప్పుడు, "అన్ని మతాలు ఒకటే" అని ఎలా చెప్పగలం? నిజానికి, అవి ఒకేలా ఉండడం అసాధ్యం. అంతేకాదు, ప్రతి మతం తన ప్రాథమిక నమ్మకాలు/ విశ్వాసాలలో అనేకమైన వాటితో విభేదిస్తుంది.

**నిర్మల:** ప్రాథమిక నమ్మకాలంటే ఏంటి?

**జెస్లిన్:** చూడు నిర్మలా, కొన్ని మతాలు మనుషులు మంచివాళ్లుగా పుడతారని, కానీ తర్వాత చెడ్డగా మారిపోతారని అంటాయి. దీనికి విరుద్ధంగా, క్రైస్తవ విశ్వాసం ఏం చెబుతుందంటే, మనం పుట్టుకతోనే పాపులం అని. మనం పాప స్వభావంతోనే పుడతాం అని చెప్తుంది. ఇంకొన్ని మతాలు పునర్జన్మను నమ్ముతాయి. కానీ క్రైస్తవ్యం దీన్ని నమ్మదు. అలాగే, మరికొన్ని మతాలు మనం దేవుళ్ళం కాగలమని చెబుతాయి. చనిపోయిన తర్వాత ఎటువంటి శిక్ష ఉండదని కూడా కొన్ని మతాలు అంటాయి. కాబట్టి, నువ్వు గమనిస్తే, వీటిలో కొన్ని ప్రాథమిక నమ్మకాలు ఒకదానికొకటి పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నాయి.

అందుకే, తార్కికంగా చూస్తే, అన్ని మతాలు ఒకేలా ఉండడం అసాధ్యం. ఎందుకంటే వాటి ప్రాథమిక నమ్మకాలే ఒకదానికొకటి విరుద్ధంగా ఉన్నాయి.

ఉదాహరణకు, ఉపనిషత్తులు, వేదాలు, భగవద్గీత ఏం చెబుతాయి? "అంతా బ్రహ్మమే, అంతా దేవునిలో భాగమే" అని చెబుతాయి. కానీ ఇది ఖురాన్‌కు విరుద్ధం. తోరాకు కూడా విరుద్ధమే. యేసు చెప్పిన మాటలకు కూడా ఇది వ్యతిరేకం. ఎందుకంటే ఖురాన్, బైబిల్ రెండూ ఏం బోధిస్తాయి? దేవుడు సృష్టికర్త అని బోధిస్తాయి. కానీ వేదాలు, ఉపనిషత్తులు ఏం నొక్కి చెబుతాయి? సృష్టితో సహా ప్రతీదీ దేవునిలో భాగమే అని అంటాయి. కాబట్టి, మనం తార్కికంగా ఒక స్పష్టమైన నిర్ణయానికి రావచ్చు. అన్ని మతాలు ఒకటే కావు అని మనం కచ్చితంగా చెప్పగలం.

**నిర్మల:** ఓహ్! కనీసం కొన్ని బోధనలలోనైనా మనం ఒకేలా ఉండమా? అయితే, మోక్షానికి అన్ని మార్గాలు ఒకటే అనే నా ఆలోచన తప్పు అన్నమాట. దేవుడు ఉన్నాడని ఆధారం ఏమిటి? మరి ఆయన ఎవరు అసలు? ఆయన అంతరిక్షంలో ఎక్కడో ఉన్న ఒక దూరపు వ్యక్తి మాత్రమేనా?

**జెస్లిన్:** దేవుడు ఉన్నాడని మనం నమ్మడానికి ఎన్నో స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి.

**1. క్రమం మరియు డిజైన్ (Order and Design):**

మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడు. నక్షత్రాలు, గ్రహాలు, ఋతువులు... అన్నీ ఒక పద్ధతి ప్రకారం నడుస్తున్నాయి కదా? దీని వెనుక ఒక గొప్ప తెలివైన శక్తి, ఒక డిజైనర్ ఉన్నాడని స్పష్టంగా తెలుస్తుంది.

2. **జీవం జీవం నుండే వస్తుంది (Life from Life):** ఒక జీవం లేకుండా మరో జీవం ఏర్పడదు కదా? ఏదో పదార్థం, శక్తి వాటంతట అవే ఏర్పాట య్యాయని నమ్మడం కన్నా, మొదట దేవుడే అన్నింటినీ సృష్టించాడని నమ్మడమే చాలా సులభం. ఉదాహరణకు, ఒక విరిగిన గడియారం దానంతట అదే పని చేయదు కదా?

3. **నైతిక ప్రమాణాలు (Moral Absolutes):** మంచి, చెడు, న్యాయం, అన్యాయం... ఈ తేడాలు మనందరికీ తెలుసు కదా? ఇవి ఎక్కడి నుండి వచ్చాయి? మానవ మనస్సు కంటే ముందే ఒక గొప్ప మనస్సు ఉండాలి. ఆ మనస్సే ఈ నైతిక ప్రమాణాలను సృష్టించింది. మన మనస్సాక్షి కూడా దీన్ని గుర్తిస్తుంది. ఎందుకంటే దాన్ని సృష్టించింది మన సృష్టికర్త.

4. **ప్రేమ (Love):** దేవుడు లేకపోతే, నిజమైన ప్రేమ అనేదే ఉండదు. ప్రేమ అనేది కేవలం ఒక భావన కాదు, ఒక గొప్ప కార్యం. యేసు ప్రభువు మనల్ని ఎంతగానో ప్రేమించాడు. అందుకే ఆయన మన పాపాల కోసం, మన రక్షణ కోసం తన ప్రాణాన్ని త్యాగం చేశాడు. ఇది ప్రేమకు గొప్ప నిదర్శనం.

**నిర్మల:** వావ్. నేనెప్పుడూ అలా ఆలోచించలేదు. దేవుడు ఉన్నాడని తెలుసుకోవడానికి ఒక తార్కిక సమాధానం ఉంది కదా. నువ్వు క్రైస్తవురాలివని నాకు తెలుసు. కానీ, చాలా మతాలలో ఇలాంటి మంచి బోధనలు ఉన్నాయి కదా. మరి క్రైస్తవ మతానికే, యేసుని దేవుడిగా నమ్మడానికే ఎందుకు అంత ప్రాధాన్యత ఇస్తారు?

**జెస్లిన్:** నిర్మలా, మంచి ప్రశ్న అడిగావు! క్రైస్తవ మతానికి, యేసుప్రభువుకు ప్రాధాన్యత ఇవ్వడానికి కొన్ని బలమైన కారణాలు ఉన్నాయి.

1. **చారిత్రక సాక్ష్యం (Historical Evidence):** యేసు ఒక పాపరహిత జీవితం జీవించాడు. ఆయన తన శత్రువులతో, "నాలో పాపం ఉందని మీరు నిరూపించండి" అని ధైర్యంగా చెప్పగలిగాడు. ఆయన విరోధులు మౌనంగా ఉండిపోయారు.

2. **నైతిక బోధనలు (Ethical Teachings):** ఆయన అద్భుతమైన నైతిక బోధనలు. అవి మానవ మనసు ఊహించలేనివి, ఎంతో ఉన్నతమైనవి. "కొండ మీద ప్రసంగం" గురించి అందరూ అంగీకరిస్తారు. అంతే కాదు, యేసు స్వయంగా దానిని ఆచరించి చూపించాడు.

3. **సిలువలో మరణం (Death on the Cross):** చరిత్రలోనే అత్యంత క్రూరమైన మరణం అది. అయినప్పటికీ, ఆయనను సిలువ వేసిన తన శత్రువులను క్షమించడానికే ఆయన ఎంచుకున్నాడు.

4. **పున:రుత్థానం (Resurrection):** యేసు చని పోయిన మూడు రోజుల తర్వాత, ఆయన భౌతికంగా సమాధి నుండి లేచాడు. 40 రోజుల వ్యవధిలో, ఆయన వేర్వేరు ప్రదేశాలలో 500 మందికి పైగా ప్రజలకు కనిపించాడు.

ఈ సత్యాలకు బైబిల్లోనూ, బైబిలు వెలుపల (Extra-biblical) ఉన్న సాక్ష్యాలు ప్రపంచంలోని ఏ మతానికీ లేనంత అద్భుతమైనవి.

5. **వ్యక్తుల జీవితాలలో మార్పు (Transformation):** అన్నిటికంటే ముఖ్యమైనది, యేసు సందేశం వ్యక్తుల జీవితాలలో కలిగించే మార్పు. నేను స్వయంగా అనుభవించిన సత్యం ఇది. మూడు సంవత్సరాల క్రితం నేను ఆయనను నమ్మినప్పుడు, యేసు నా జీవితాన్ని పూర్తిగా మార్చాడు.

**నిర్మల:** అది అద్భుతం, జెస్! ఈ సంభాషణ నాకు చాలా నచ్చింది. మనం తరచుగా మాట్లాడుకోవాలి. కొన్నిసార్లు మనం విభేదించినా ఫర్వాలేదు. అయ్యో, గంట మోగింది! క్లాస్‌కి టైమ్ అవుతుంది.

**జెస్లిన్:** తప్పకుండా, నాకూ చాలా ఇష్టమే. మనం మాట్లాడుకుంటూనే ఉందాం. నిజమే, మన తర్వాతి లెక్చర్, జ్యూరిస్ప్రుడెన్స్‌కి సమయం అయింది. వెళ్దామా?

**రిఫరెన్స్**


1. బైబిలు ఆధారిత సేవలు (Biblically Shaped Ministries)–https://share.google/2IQO1Xavl8SwAWmy9
2. https://youtube.com/shorts/uCM4b01dPiQ?siR5sbSfP1IGCFPiQrl
3. క్లిఫ్ కనెక్ట్ పాడ్‌కాస్ట్‌లు “గివ్ మీ ఏన్ ఆన్సర్” (Give Me An Answer)


**– సుజీ క్రిస్టోఫర్**

(భద్రత దృష్ట్యా పేరు మార్చబడింది).

ఆసియాలోని ఒక క్లోజ్డ్ దేశంలో యూనివర్సిటీ క్యాంపస్ మిషన్‌లో తన భర్తతో కలిసి పని చేస్తున్నారు. గత 18 సంవత్సరాలుగా ఈ విద్యార్థి మిషన్‌లో ఉంటూ, అనేక ప్రాంతాలలో ఆమె పనిచేశారు.

* * * * * *





UESI
TELANGANA

**Hearts & Hands**
**(Contributing to the Cause)**
**“BE STRONG AND DO THE WORK”**
**- 1 CHRONICLES 28:10**


We humbly come before you with a special request for prayer. As we set out on a significant mission to expand and improve our facilities, we are reminded of the Lord's call to be strong and faithful in our work. We ask for your fervent prayers for the construction of second floor slab and columns.

- **Second Floor Hall (slab area of 7,300 sq. ft.):** Costing an estimated **Rs. 40 lakhs**, for columns and slab.



We are aiming to complete the second floor hall by December 2025. Pray for wisdom, skilled labor, and divine provision to see this vision through.

**- G. Varaprasad,** Property Secretary, UESI-TG




# దేవుని మనసులోని న్యాయం

మనం దేవుని మనసు గురించి ఆలోచించినప్పుడు, ఆయన ప్రేమను, కనికరాన్ని, కృపను తరచుగా గుర్తు చేసుకుంటాం. అయితే, పరిశుద్ధ గ్రంథమంతటా దేవుని న్యాయం గురించిన విషయం స్పష్టంగా కనిపిస్తుంది. అన్యాయం చేయబడిన వారిని ఆయన కాపాడుతాడు. వారిని తిరిగి స్థిరపరుస్తాడు. పైకి లేవనెత్తుతాడు. దేవుని నిజంగా అర్థం చేసుకోవాలంటే, న్యాయం పట్ల ఆయనకున్న శ్రద్ధను తెలుసుకోవాలి. బాధించబడేవారి పట్ల ఆయనకున్న కనికరాన్ని కూడా అర్థం చేసుకోవాలి.

క్రీస్తును వెంబడించేవారిగా మనం, దేవుని న్యాయాన్ని నమ్మడమే కాదు. దానిని మన జీవితంలో ఆచరించడానికి కూడా పిలవబడ్డాం. కొంతమంది న్యాయం అనేది మన విశ్వాసానికి కేవలం ఒక అదనపు భాగం మాత్రమే అనుకుంటారు. అందుకే వారు సామాజిక కార్యక్రమాలలో పెద్దగా పాల్గొనరు. కానీ దేవునితో నడవాలంటే, న్యాయం చాలా ప్రధానమైన భాగం. జాన్ స్టాట్ గారు ఇలా అన్నారు: "బైబిలు బోధించే నీతి కేవలం వ్యక్తిగత విషయమే కాదు. అది సామాజిక నీతిని కూడా కలిగి ఉంటుంది."[1] మనం నీతిని మన వ్యక్తిగత జీవితాలకు మాత్రమే పరిమితం చేయకూడదు. నీతి అంటే ఇంట్లో, పని ప్రదేశంలో, జీవితంలోని ప్రతి విషయంలోనూ అణచివేత నుండి స్వేచ్ఛ కలిగి ఉండాలి. న్యాయం, యథార్థత కూడా ఉండాలి. అన్యాయం, అణచివేత నీతిమంతులను కలవరపరచాలి. పరలోకంలో జరిగేలాగే, భూమి మీద కూడా దేవుని చిత్తం నెరవేరాలని మనం కోరుకోవాలి (మత్తయి 6:10).

## 1. దైవ వాక్యం మనకిచ్చే పిలుపు

ఆదికాండం నుండి ప్రకటన గ్రంథం వరకు చూడండి. పరిశుద్ధ బైబిల్ అంతటా ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. దేవుడు బలహీనులను కాపాడేవాడు. అణగారిన వారికి ఎప్పుడూ అండగా నిలిచేవాడు. పాత నిబంధనలోని ప్రవక్తలు కూడా, తరచుగా అన్యాయాల పైనా, అణచివేతల పైనా ధైర్యంగా మాట్లాడారు. మీకా 6:8 దీన్ని ఎంత చక్కగా చెప్తుందో చూడండి: "మనుష్యుడా, యేది ఉత్తమమో అది నీకు తెలియజేయబడియున్నది; న్యాయముగా నడుచుకొనుటయు, కనికరమును ప్రేమించుటయు, దీనమనస్సు కలిగి నీ దేవుని యెదుట ప్రవర్తించుటయు, ఇంతేగదా యెహోవా నిన్నడుగుచున్నాడు." ఇదే కదా మన ప్రభువు మన నుండి కోరేది?

దేవుడు ఇశ్రాయేలీయులకిచ్చిన ఆజ్ఞలు ఎక్కువగా

[1] *Sermon on the Mount: Bible Speaks Today* on Olive Tree Bible App.

బలహీనుల గురించి ఉండేవి. విధవరాండ్ర గురించి, అనాథల గురించి, పరదేశుల గురించి ఆయన ప్రత్యేకంగా ఆజ్ఞాపించారు. వారందరినీ కాపాడమని దేవుడు స్పష్టంగా చెప్పారు (ద్వితీ 10:18-19). న్యాయం అంటే కేవలం చట్టాలకు లోబడి ఉండటం మాత్రమే కాదు. అది కేవలం శాంతిభద్రతలకు సంబంధించినది కాదు. ప్రతి మనిషిలోనూ దేవుని స్వరూపం ఉంది. కాబట్టి, ప్రతి ఒక్కరినీ గౌరవంగా చూడాలి.

కొత్త నిబంధనలో కూడా అణగారిన వారి పట్ల శ్రద్ధ తగ్గలేదు. ఈ ప్రేమ కొనసాగుతూనే ఉంది. యాకోబు పత్రికలో ఒక చక్కటి మాట ఉంది. "తండ్రిలేనివారిని, విధవరాండ్రను వారి కష్టాల్లో ఉన్నప్పుడు దర్శించేదే" అసలైన భక్తి అని యాకోబు అంటాడు (యాకోబు 1:27). బాప్తిస్మమిచ్చు యోహాను రెండు అంగీలున్నవాడు, లేనివానికి ఒక అంగీ ఇవ్వమని బోధించాడు. దేవుని నిజంగా ఎరిగినవారు, సమాజం మరచిపోయిన వారిని ఆదుకోవాలి.

కాబట్టి, బైబిల్‌లో న్యాయం అంటే ఏమిటి? అది కేవలం న్యాయబద్ధత, కనికరం మాత్రమే కాదు. అది మన దైనందిన జీవితంలో నీతిగా ఉండటాన్ని తెలియజేస్తుంది. మనం పనివారిని ఎలా చూస్తున్నాం? పేదల పట్ల మనం ఎలా మాట్లాడుతున్నాం? ఎవరికైనా ఏదైనా అవసరం అని చూసినప్పుడు, మనం ఎలా స్పందిస్తున్నాం? ఇదంతా న్యాయంలో భాగమే.

## 2. యేసు జీవితం, ఆయన సేవ

యేసు పరిచర్య దేవాలయానికే, సమాజ మందిరానికే పరిమితం కాలేదు. ఆయన ప్రజల మధ్యలో సేవ చేశాడు. కుష్ఠురోగులను ప్రేమగా ముట్టాడు. పన్ను వసూలు చేసేవారితో కలిసి భోజనం చేశాడు. సమరయ స్త్రీలతో మాట్లాడాడు. సాంస్కృతిక, సామాజిక, మతపరమైన అడ్డంకుల ను ఆయన దాటాడు. దేవుని రాజ్యం అందరినీ స్వాగతిస్తుందని చూపించాడు.

లూకా 4:18-19 లో, యేసు తన పరిచర్యను యెషయా ప్రవచనం ద్వారా ప్రకటించాడు: "ప్రభువు ఆత్మ నామీద ఉన్నది; ఎందుకంటే దేవుడు పేదలకు సువార్త ప్రకటించడానికి నన్ను అభిషేకించాడు. బంధింపబడినవారికి విడుదల, గుడ్డివారికి దృష్టి, నలిగినవారిని విడిపించుట, ప్రభువు అనుగ్రహ సంవత్సరము ప్రకటించుట, ఆయన నన్ను పంపియున్నాడు."

యేసు రోగులను స్వస్థపరిచాడు. సమాజం నుండి వెలివేయబడిన వారికి గౌరవం తిరిగి ఇచ్చాడు. పాపులను క్షమించాడు. ఆయన దయ ఎన్నో జీవితాలను మార్చేసింది. యేసు అణగారినవారితో వ్యవహరించిన తీరు దేవుని హృదయాన్నే చూపిస్తుంది. ఆయన పేదలకు సేవ చేశాడు. ఎందుకంటే అది తన తండ్రి స్వభావాన్ని ప్రతిబింబించింది. దయ చూపిన ప్రతి పనిలో, న్యాయం, కరుణ విడదీయరానివని యేసు చూపించాడు.

క్రీస్తును అనుసరించడం అంటే, మనం కూడా ఆయనలాగే ఉండాలి. క్రీస్తుకు ఎలాంటి భావాలు ఉన్నాయో, మనకూ అలాంటి భావాలు ఉండాలి. ఆయన ఎలా జాగ్రత్త తీసుకున్నాడో, మనం కూడా అలాగే జాగ్రత్త తీసుకోవాలి. ఆయన ప్రజలను ఎలా చూశాడో, మనం కూడా అలాగే చూడాలి.

## 3. క్రైస్తవ ఆజ్ఞ

సంఘం ఈ లోకంలో దేవుని న్యాయానికి ఒక సాధనంగా ఉండాలి. దేవుని న్యాయాన్ని చూపించడానికి మనం నిలబడాలి. పరిశుద్ధ గ్రంథమంతా ఈ విషయాన్నే స్పష్టం చేస్తుంది. మాట్లాడలేని వారి పక్షాన మాట్లాడమని దేవుడు తన ప్రజలకు బాధ్యత అప్పగించాడు (సామెతలు 31:8-9). న్యాయం కోసం నిలబడటం అంటే దేవుని రాజ్య విలువలతో ఏకీభవించడం. అది సత్యాన్ని కాపాడటం. బలహీనుల పక్షాన నిలబడటం. ఇతరులను అణచివేసే వ్యవస్థలను, వైఖరులను ఎదిరించడం.

ఆదిమ సంఘంలో విశ్వాసులు అద్భుతమైన ఉదారత చూపారు. వారు తమ ఆస్తులను

పంచుకున్నారు. విధవరాండ్రను జాగ్రత్తగా చూసుకున్నారు. ఎవరూ కష్టాల్లో ఉండకుండా చూసుకున్నారు (అపొ. కార్య. 2:44-45, 4:32-35). వారి విశ్వాసం ఆచరణాత్మకంగా ఉండేది. క్రీస్తు పట్ల వారి ప్రేమ వారి పొరుగువారి పట్ల ప్రేమలో కనిపించింది. ఈ రోజు మనకు కూడా అదే పిలుపు ఉంది. అది అణగారిన పిల్లలకు సహాయం చేయడం కావచ్చు. మానవ అక్రమ రవాణాను వ్యతిరేకించడం కావచ్చు. లేదా కష్టాల్లో ఉన్న ఒక కుటుంబానికి కరుణ చూపడం కావచ్చు. ఏదైనా సరే, న్యాయం కోసం చేసే పని సువార్త పనితో సమానం.

మన చుట్టూ జరుగుతున్న అన్యాయం గురించి బాధపడటానికి మాత్రమే మనం పిలువబడలేదు. మనం మంచి చేయమని పిలువబడ్డాం (యెషయా 1:17).

## 4. న్యాయం మరియు దేవుని స్వభావం

కీర్తనకారుడు ఒక అద్భుతమైన సత్యాన్ని ప్రకటిస్తున్నాడు. "యెహోవా నీతిమంతుడు, ఆయన నీతిని ప్రేమించువాడు" (కీర్తనలు 11:7). అవును, న్యాయం అనేది దేవుడు చేసే పనుల్లో కేవలం ఒకటి మాత్రమే కాదు. అది ఆయన స్వభావమే! మన దేవుడు నీతితో, సమన్యాయంతో పరిపాలిస్తాడు.

దేవుడు ఇశ్రాయేలు ప్రజలకు తనను తాను ప్రత్యక్షపరచుకున్నప్పుడు, ఆయన తన గురించి ఇలా చెప్పాడు: "యెహోవా కనికరము, దయ, దీర్ఘశాంతము, విస్తారమైన కృపాసత్యములుగల దేవుడు" (నిర్గమ 34:6). కానీ, ఆ మరుసటి వచనంలోనే ఆయన ఒక ముఖ్యమైన విషయాన్ని జతచేశాడు. "దోషులను నిర్దోషులుగా ఎంచడు" (నిర్గమ 34:7). చూసారా? ఆయన దయ, ఆయన న్యాయం ఒకదానికొకటి విరుద్ధం కావు. వాస్తవానికి, అవి ఒకే నాణేనికి ఉన్న రెండు వైపుల వంటివి.

కాబట్టి, గుర్తుంచుకోండి. అన్యాయం అనేది కేవలం ఒక సామాజిక సమస్య మాత్రమే కాదు. అది మన నీతిగల దేవునికి విరుద్ధంగా చేసే ఒక ఘోరమైన పాపం. మనం అణచివేయబడిన వారి ఏడుపులను, వారి కేకలను విస్మరించినప్పుడు, మనం కేవలం తోటి మానవులను మాత్రమే నిర్లక్ష్యం చేస్తున్నామని కాదు. మనం మన దేవుని హృదయాన్ని తీవ్రంగా దు:ఖపరుస్తున్నాం.

కాబట్టి, న్యాయం కోసం ప్రయత్నించడం, న్యాయాన్ని కోరడం అనేది ఒక ఆరాధన కార్యం. మనం నీతి, సమన్యాయం కోసం నిలబడినప్పుడు, మనం సాక్షాత్తు దేవుని హృదయాన్ని ప్రతిబింబిస్తాం. నిజంగా, న్యాయంగా జీవించడం అంటే దేవునికి ఇష్టమైన విధంగా, దైవభక్తితో జీవించడమే.

## 5. న్యాయంగా జీవించడం

దేవునికి న్యాయం పట్ల ఉన్న హృదయాన్ని అర్థం చేసుకోవడం ఆరంభం మాత్రమే. తరువాత అడుగు దానిని ఆచరణలో పెట్టడమే. న్యాయం చిన్న చిన్న, రోజువారీ ఎంపికల నుండే మొదలవుతుంది. ఈ ఎంపికలు కరుణతో కూడిన జీవనశైలిగా మారతాయి.

విశ్వాసులుగా, సమాజంలో దేవుని న్యాయాన్ని మనం ఎలా ఆచరించాలో ఇక్కడ కొన్ని ఆచరణాత్మక మార్గాలు ఉన్నాయి:

### ఎ) వినండి, నేర్చుకోండి

న్యాయం, అర్థం చేసుకోవడంతో మొదలవుతుంది. బాధపడేవారి కథలను శ్రద్ధగా వినండి. మీ చుట్టూ ఉన్న పేదవారు, వలసదారులు, అణగారిన వర్గాల కష్టాల గురించి తెలుసుకోండి. వారి పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. మీ చుట్టూ ఉన్న అణచివేయబడిన వారి గురించి జ్ఞానం పెరిగే కొద్దీ, వారి పట్ల మీ కరుణ కూడా పెరుగుతుంది.

### బి) స్థానికంగా సేవ చేయండి

దేవుని ప్రేమను చేతల్లో చూపించండి. పేదరికం నుండి వచ్చిన ఒక విద్యార్థికి మెంటార్‌గా ఉండండి. వారికి చదువులో

సహాయం చేయండి. ఎవరికైనా ఆర్థికంగా సహాయం చేయండి. రోగులను, వృద్ధులను సందర్శించండి. వారికి ధైర్యం చెప్పండి. కరుణతో కూడిన ఈ పనులు దేవుని ప్రేమను ఇతరులు చూడటానికి, అనుభవించడానికి తలుపులు తెరుస్తాయి.

**సి) నిజాయితీ గల పద్ధతులను ప్రోత్సహించండి**

మీ కొనుగోళ్లు, మీ పని, మీ నిర్ణయాలు ఇతరులను ఎలా ప్రభావితం చేస్తాయో జాగ్రత్తగా గమనించండి. కేవలం మన సౌకర్యం లేదా లాభం కోసమే చూడకండి. న్యాయాన్ని, నిజాయితీని ఎంచుకోండి.

**డి) సత్యం కోసం మాట్లాడండి**

మీ కార్యాలయంలో, మీ సంఘంలో, మీ సమాజంలో సత్యం కోసం నిలబడటానికి మీ స్వరాన్ని ఉపయోగించండి. అన్యాయం జరుగు తున్నప్పుడు చూస్తూ ఊరుకోవడం మంచిది కాదు. ప్రజలు అన్యాయాన్ని ఎదుర్కొంటున్నప్పుడు మనం మౌనంగా ఉంటే, ఆ తప్పు మరింత పెరగడానికి మనం అనుమతిస్తున్నట్లే.

**ఇ) ప్రార్థించండి, భాగస్వామ్యం కండి**

మీ సమాజంలో, మీ గ్రామంలో, మీ నగరంలో, ప్రపంచంలో దేవుని న్యాయం ప్రబలంగా ఉండాలని ప్రార్థించండి. దేవుడు తన నీతిని స్థాపించేలా మనం నిరంతరం ప్రార్థించాలి. పేదలకు సేవ చేసే మరియు నీతి కోసం నిలబడే సంస్థలు మరియు పరిచర్యలతో భాగస్వామ్యం కండి.

**ముగింపు**

దేవుని న్యాయమైన హృదయం ఎలాంటిదో మనం అర్థం చేసుకున్నప్పుడు, ఈ లోకంపై మన ఆలోచన విధానం పూర్తిగా మారిపోతుంది. అది మనల్ని ఉదాసీనతను వదిలి, ముందుకు సాగేలా చేస్తుంది. సుఖంగా ఉండాలన్న ఆలోచన నుండి, ఇతరులపై కరుణ చూపడానికి నడిపిస్తుంది.

దేవుని న్యాయం అంటే కేవలం పాపులను శిక్షించడం మాత్రమే కాదు. అది అంతకు మించినది. పడిపోయిన వారిని తిరిగి నిలబెట్టడం. గాయపడిన వారిని స్వస్థపరచడం. తప్పులను సరిచేసి, అన్నిటినీ బాగుచేయడం కూడా దేవుని న్యాయంలో భాగమే.

మనం పేదలకు అండగా నిలబడినప్పుడు, బాధపడుతున్న వారి పట్ల శ్రద్ధ చూపినప్పుడు, గొంతులేని వారికి ఒక స్వరం అయినప్పుడు మనం దేవునితోనే కలిసి నిలబడుతున్నాం. సామెతలు 14:31 నన్ను ఎప్పుడూ ఆలోచింపజేస్తుంది. అది ఇలా చెబుతుంది: “దరిద్రుని బాధించువాడు వాని సృష్టికర్తను నిందించు వాడు బీదను కనికరించువాడు ఆయనను ఘనపరచువాడు.”

దేవుని ప్రేమించడం అంటే, న్యాయాన్ని ప్రేమించడమే ఆయనతో కలిసి నడవడం అంటే, నీతి మార్గంలో, కరుణతో నిండిన హృదయంతో నడవడమే. మన వ్యక్తిగత జీవితాలు, మనం కూడుకునే సంఘాలు, మనం జీవించే సమాజాలు ఇవన్నీ దేవుని హృదయాన్ని ప్రతిబింబించుగాక! ఆ దేవుని హృదయం కరుణతో, న్యాయంతో, నీతితో నిండి ఉంది. ఆమేన్.

**– రెవ. డా. డేవిడ్ మెండె**

రెవ. డా. డేవిడ్ మెండె గారు హైదరాబాద్‌లోని ఎల్ షద్దాయి అసెంబ్లీ ఆఫ్ గాడ్ సంఘానికి ప్రధాన పాస్టర్‌గా సేవలందిస్తున్నారు.

వీరు బెంగళూరులోని సదరన్ ఏషియా బైబిల్ కాలేజి (SABC), హైదరాబాద్‌లోని హైదరాబాద్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ థియాలజీ అండ్ అపాలజెటిక్స్ (HITHA), ఆంధ్రప్రదేశ్ బైబిల్ కాలేజి (APBC), అమెరికాలోని సమ్ (SUM) బైబిల్ కాలేజి అండ్ థియోలాజికల్ సెమినరీలలో భాగస్వామ్య అధ్యాపకులుగా (Adjunct Faculty) వ్యవహరిస్తున్నారు.

డా. మెండె గారు రచించిన పది పుస్తకాలలో, ప్రసిద్ధి చెందిన “ఆరోగ్యం, సంపద సువార్త వలన ప్రమాదాలు” (The Dangers of the Health and Wealth Gospel) అనే పుస్తకం కూడా ఉంది.



# దేవుడు లేని నైతికత సాధ్యమేనా?

నైతికత అనేది చాలా ముఖ్యమైన విషయం. మంచిని చెడు నుండి వేరు చేసే విధానం ఇది. మన నిర్ణయాలకు మార్గనిర్దేశం చేసే సూత్రాలు కూడా నైతికతే. మానవ సమాజానికి నైతికత ఒక మూలస్తంభం లాంటిది.

ఈ నైతికత వ్యక్తిగత ఆలోచనల నుండి రావచ్చు. లేదా ఒక సమాజ సంస్కృతి నుండి ఉద్భవించవచ్చు. మతపరమైన విశ్వాసాల నుండి కూడా ఇది వస్తుంది. నిజాయితీ, గౌరవం, కరుణ వంటి మంచి ప్రమాణాలను ఇది అందిస్తుంది.

అయితే, మన క్రైస్తవ దృక్పథం ప్రకారం ఒక ముఖ్యమైన విషయాన్ని మనం అర్థం చేసుకోవాలి. కేవలం మానవ ఆధారిత నైతికతకు కొన్ని పరిమితులు ఉన్నాయి. వాస్తవానికి, అది వ్యక్తిగతమైనది (subjective) మరియు లోపభూయిష్టమైనది. అంటే, అన్ని విలువలు కేవలం మనుష్యులచే నిర్మించబడినవి అయితే, ఏదీ అంతిమంగా, సార్వత్రికంగా తప్పు అని చెప్పలేము. ఒకరికి తప్పు అయినది మరొకరికి మంచి అనిపించవచ్చు.

పరిశుద్ధ లేఖనాలు ఈ పరిమితిని మనకు స్పష్టంగా గుర్తుచేస్తాయి. యెషయా 64:6 లో ఇలా వ్రాయబడి ఉంది: “మేమందరము అపవిత్రుల వంటి వారమైతిమి మా నీతి క్రియలన్నియు మురికిగుడ్డ వలె నాయెను” ఈ మాటలు మనకు చాలా లోతైన సత్యాన్ని బోధిస్తున్నాయి. దేవునితో సంబంధం లేకుండా మనం చేసే నీతి ప్రయత్నాలన్నీ ఆయన పరిపూర్ణతకు చాలా దూరంగా ఉంటాయి.

### 1.నైతిక విలువల మూలం

బైబిల్ ప్రకారం, నీతి అనేది మన సొంత ఆలోచనలనో, ఉద్దేశాలనో బట్టి ఉండదు. అది

మనుషుల నుండి పుట్టింది కాదు. అది దేవుడు మనకిచ్చిన గొప్ప బహుమానం. ఆయన సంపూర్ణ చిత్తాన్ని అది మనకు బయలుపరుస్తుంది. నీతికి మూలం దేవుని స్వభావం. ఆయన బోధనలే దానికి ఆధారం.

దీన్ని మనం "దేవుని ప్రేమించు, నీ పొరుగు వారిని ప్రేమించు" అనే ఆజ్ఞలో స్పష్టంగా చూడవచ్చు. ఈ రెండు ప్రేమలలోనే క్రైస్తవ నీతికి ప్రధాన సూత్రాలు ఉన్నాయి. ఈ ప్రేమలను మనం పూర్తిగా అర్థం చేసుకుని ఆచరిస్తే, యేసుక్రీస్తు అడుగుజాడల్లో నడవగలం.

అంతేకాదు, మన శత్రువులను ప్రేమించగలం. మనల్ని హింసించే వారి కోసం ప్రార్థించగలం. ఇది మామూలు విషయం కాదు కదా! దేవుని నీతి ప్రమాణాలు మామూలువి కావు. అవి తక్కువ స్థాయివి అసలే కావు. ఆయన ఉన్నతమైన ప్రమాణాన్ని నిర్దేశించాడు. "నేను పరిశుద్ధుడనై ఉన్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడి" (1 పేతురు 1:16) అనే ఆజ్ఞే దీనికి ఆధారం. ఎంత గొప్ప సత్యం!

కాబట్టి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులం దరికీ, యేసుక్రీస్తు జననం, ఆయన జీవితం, ఆయన బోధనలే నీతి విలువలకు ప్రధానమైన, ఖచ్చితమైన మూలం. ఆయన జీవితం నీతికి, ప్రేమకు, కనికరానికి, నిస్వార్థానికి ఒక పరిపూర్ణ మైన ఆదర్శం.

## 2.వివిధ విశ్వాసాలలో నైతికత

మన చుట్టూ ఉన్న ప్రపంచంలో, ఎన్నో రకాల విశ్వాసాలు, మతాలు ఉన్నాయి కదా. ఈ ప్రతి విశ్వాసానికి ఒక నైతికత ఉంటుంది. అంటే మంచి, చెడుల గురించిన అవగాహన అన్నమాట. కరుణ, న్యాయం వంటి గొప్ప మానవ విలువల ఆధారంగా ఈ నైతికతను చాలా మంది అర్థం చేసుకుంటారు. అయితే, ఈ నైతికతకు మూలాలు మాత్రం ప్రతి విశ్వాసంలోనూ చాలా వేరుగా ఉంటాయి. ఇది మనం జాగ్రత్తగా గమనించాలి.

క్రైస్తవ్యం, ఇస్లాం మతాలలో అయితే, నైతికత అనేది ముఖ్యంగా దైవిక ప్రత్యక్షత, దేవుని ఆజ్ఞల నుండి వస్తుంది. దేవుడు మనకు ఇచ్చిన ప్రేమతో కూడిన ఆజ్ఞలలో ఈ నైతికతను మనం చూడగలం. ఈ రెండు మతాలు దయ, నిజాయితీ, దానం వంటి మంచి గుణాలను ప్రాముఖ్యతనిస్తాయి.

అయితే, మానవ స్వభావం గురించి ఈ రెండు మతాలకు ఒక ముఖ్యమైన తేడా ఉంది. క్రైస్తవ్యం ప్రకారం, మానవుడు పాపంతో పుడతాడు. పాపం మన జీవితంలో ఒక భాగం అవుతుంది. ఈ పాపం నుండి విడిపింపబడాలంటే, యేసుక్రీస్తు రక్తం ద్వారానే కడగబడి, రక్షణ పొందాలి. ఆయన త్యాగం మన పాపాలకు ప్రాయశ్చిత్తం. ఇస్లాం మతం అయితే, మనుషులు మంచిగా పుడతారు అని చెబుతుంది. కానీ లోకం వల్ల, చెడు ప్రభావాల వల్ల చెడిపోతారు అంటుంది. క్రైస్తవులు పరిశుద్ధ బైబిల్‌ను నమ్ముతారు. ఇస్లాం మతం ఖురాన్‌ను ఆధారం చేసుకుంటుంది.

మరో వైపు, హిందూ మతంలో నైతికత అనేది ధర్మానికి (సరైన ప్రవర్తన), కర్మకు ముడిపడి ఉంది. మనం చేసే పనుల ఫలితాలను కర్మ నిర్ణయిస్తుంది. అన్ని జీవులలోనూ దైవిక సారం ఉంటుందని ఈ మతం విశ్వసిస్తుంది. అందుకే, అహింస (హింస చేయకపోవడం), సత్యం (నిజం) వంటి గొప్ప గుణాలను ఈ మతం బోధిస్తుంది. మహాభారతం, వేదాలు వంటి గ్రంథాల ద్వారా

వీటికి మార్గదర్శకత్వం లభిస్తుంది.

అలాగే, బౌద్ధ మతంలో నైతికత అనేది కొన్ని స్వచ్ఛందమైన నిబంధనల ద్వారా నిర్వచించ బడుతుంది. అవి ఏంటంటే, హింసించకపోవడం, దొంగిలించకపోవడం, అబద్ధం చెప్పకపోవడం, దుష్ప్రవర్తన చేయకపోవడం. ఈ నిబంధనలను పాటించడం ద్వారా అంతర్గత శాంతి లభిస్తుంది. బుద్ధుని బోధనలు, జ్ఞానోదయం పొందాలనే కోరిక దీనికి ఆధారం.

### 3.దేవుని ఆజ్ఞల అధికారం

మన జీవితంలో మంచి ఏమిటి, చెడు ఏమిటి అని తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఈ విషయాన్ని అర్థం చేసుకోవడానికి దేవుని ఆజ్ఞలు మనకు ఎంతో ప్రాముఖ్యమైనవి. పరిశుద్ధ బైబిలు లేఖనాలు కూడా అంతే ముఖ్యం. ఇవి విశ్వాసికి దారి చూపిస్తాయి. మంచి ఏమిటి? చెడు ఏమిటి? అని అర్థం చేసుకోవడానికి అవి సహాయపడతాయి.

కొన్ని నిర్దిష్ట ఆజ్ఞలు ఉన్నాయి. ఉదాహరణకు, తల్లిదండ్రులను గౌరవించాలి. వ్యభిచారం చేయ కూడదు. హత్య చేయకూడదు. దొంగతనం చేయ కూడదు. ఇవన్నీ చాలా స్పష్టమైన ఆజ్ఞలు. ఇవి మన నైతిక ప్రవర్తనకు ఆధారం. సమాజంలో మనం ఎలా ఉండాలో కూడా నేర్పిస్తాయి. మన వ్యక్తిత్వాన్ని మంచిగా మలచడానికి అవి దోహద పడతాయి.

మన సృష్టికర్తయైన దేవుడిని మనం ఆరాధించాలి. ఆయన బోధనలను నమ్మకంగా అనుసరించాలి. ఇవి మనకు మంచి దారి చూపిస్తాయి. మనం నైతికంగా, ధర్మబద్ధంగా జీవించడానికి సహాయపడతాయి. ఒక విశ్వాసికి, యేసుక్రీస్తు బోధనలు చాలా ముఖ్యమైనవి. అవి దేవుడు మనకు చూపిన మార్గం. సరైన జీవితాన్ని ఎలా జీవించాలో అవి నేర్పిస్తాయి. నైతికతకు అవి ఒక స్పష్టమైన పునాదిని ఇస్తాయి.

ఈ బయట ఉన్న ఆజ్ఞలు మనకు మార్గం చూపిస్తాయి. కానీ లోపల కూడా మనకు ఒక మార్గదర్శి ఉంది. అదే మన స్పష్టమైన మనస్సాక్షి. లేదా మనం దానిని నైతిక దిక్సూచి అని పిల వవచ్చు. తరచుగా ఇది పరిశుద్ధాత్మ నడిపింపే. మంచి పనులను, చెడు పనులను గుర్తించడానికి ఇది మనకు సహాయపడుతుంది.

### 4.నైతిక సందిగ్ధతలలో విశ్వాసం మనకు మార్గదర్శకం

మన జీవితంలో ఎన్నోసార్లు మనం కొన్ని కష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటాం. వీటినే నైతిక సందిగ్ధతలు అంటాం. అక్కడ రెండు మంచి సూత్రాలు ఒకదానికొకటి ఎదురుపడతాయి. ఏది సరైనదో ఎంచుకోవడం కష్టం అవుతుంది. కొన్ని సార్లు మనం ఏదో ఒక విషయంలో రాజీ పడాల్సి వస్తుంది. అయితే, ఈ కష్టమైన సమయాలలో మన వ్యక్తిగత విశ్వాసం మనకు గొప్ప ఆధారం. ఇది మనకు స్పష్టమైన నియమాలను, మంచి ల క్షణాలను, సరైన మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది.

ఒక ఉదాహరణ చూద్దాం. ఆకలితో అల మటించే ఒక దొంగ పరిస్థితిని ఆలోచించండి. ఒక వ్యక్తి ఆకలితో అల్లాడుతున్న తన కుటుంబాన్ని పోషించడానికి రొట్టె దొంగిలిస్తాడు. దొంగలించడం తప్పు అని చాలా మతాలు చెబుతాయి. అదే సమయంలో, పేదల పట్ల కరుణ చూపాలని అన్ని మతాలు బోధిస్తాయి. మరి క్రైస్తవ విశ్వాసం ఇలాంటి పరిస్థితిలో ఏమి చెబుతుంది? దొంగతనం చేయకూడదు అనేది దేవుని ఆజ్ఞ. దానిని మనం తప్పకుండా పాటించాలి. అయితే, ఆ దొంగతనం

వెనుక ఉన్న ఆకలిని, కష్టాన్ని మనం అర్థం చేసుకోవాలి. వారికి కరుణతో సహాయం చేసి, ఆకలి సమస్యను తీర్చడానికి కృషి చేయాలి. దేవుడు మన హృదయాలలో ప్రేమను, కరుణను నింపమని కోరుతున్నాడు.

ఇంకొక తీవ్రమైన ఉదాహరణ చూద్దాం. తీవ్రమైన నొప్పి, బాధతో ఉన్న ఒక రోగి, తన బాధను తగ్గించుకోవడానికి "కారుణ్య మరణం" (euthanasia) కోరడం. క్రైస్తవ విశ్వాసం ప్రకారం, ప్రాణం అనేది దేవుడు మనకు ఇచ్చిన ఎంతో విలువైన, పవిత్రమైన బహుమతి. ప్రాణం దేవునిది, ఆయనే దానిని ఇచ్చేవాడు, తీసేవాడు. విశ్వాసులుగా మనం ప్రాణం యొక్క పవిత్రతను గౌరవించాలి. అదే సమయంలో, బాధపడుతున్న వారి పట్ల కరుణ చూపాలి. రోగి గౌరవాన్ని కాపాడాలి. వారి బాధను తగ్గించడానికి అన్ని ప్రయత్నాలు చేయాలి. కానీ, వారి ప్రాణాన్ని అంతం చేయడానికి మాత్రం మనం పాల్పడ కూడదు.

## ముగింపు

మన జీవిత ప్రయాణంలో విశ్వాసం ఎంత ముఖ్యమో మనందరికీ తెలుసు. ప్రతి విశ్వాసికి, జీవితంలోని సంక్లిష్టతలను అర్థం చేసుకోవడానికి, వాటిని ఎదుర్కోవడానికి విశ్వాసం నిజంగా ఒక ముఖ్యమైన ఆధారం. కష్ట సమయాల్లో ఇది మనకు స్పష్టతనిస్తుంది. మన వ్యక్తిగత విలువలకి బలమైన పునాదిని కూడా నిర్మిస్తుంది.

మనం ఎలా జీవిస్తున్నామో ఒక్కసారి ఆలోచిద్దాం. మన వ్యక్తిగత విలువలు మన ఆధ్యాత్మిక నమ్మకాల ద్వారా ఎలా రూపుదిద్దుకున్నాయో మనం స్పష్టంగా గుర్తించినప్పుడు, మన జీవితాన్ని మరింత యథార్థంగా జీవించడానికి ప్రణాళిక వేసుకోగలం. అప్పుడు మన పనులు, క్రియలు దేవుని చిత్తానికి అనుగుణంగా ఉంటాయి.

మరి ఈ బలం మనకెక్కడ నుండి వస్తుంది? ఈ ఆధ్యాత్మిక బలం ప్రభువుతో వ్యక్తిగత సమయం కేటాయించడం ద్వారానే లభిస్తుంది. ప్రతిరోజు బైబిల్ చదవడం ద్వారా ఆయన మాటలను విందాం, వ్యక్తిగత ప్రార్థన ద్వారా ఆయనతో మాట్లాడదాం. తోటి విశ్వాసులతో సహవాసంలో పాలు పంచుకుంటూ, మనం ఆత్మీయంగా ఆయనకు మరింత దగ్గరవుతాం.

మనం ఇలా దేవునితో సమయం గడుపుతూ, ఆయన మాటలకు విధేయులైనప్పుడు, దేవుడు మనకు అద్భుతమైన బలాన్ని అనుగ్రహిస్తాడు. ఆ బలం ద్వారా మనం క్రైస్తవ, నైతిక విలువలతో కూడిన జీవితాన్ని జీవిస్తాం. ఇలాంటి నిబద్ధతే మనం దేవుడు ఆశించిన మంచి ఫలాలను ఫలించేలా చేస్తుంది. లోకంలో క్రీస్తుకు గొప్ప సాక్షులుగా ఉండటానికి ఇది మనకు సహాయపడుతుంది. చివరికి, మన జీవితాల ద్వారా దేవుడిని మహిమపరచగలం.

## రిఫరెన్స్


1. వాల్టర్ హారింగ్టన్ రచించిన 'పారడాక్స్ ఆఫ్ క్రిస్టియన్ మోరాలిటీ' (Paradox of Christian Morality) వ్యాసం
2. డెబ్రా స్మ్యాక్ రచించిన 'ఫెయిత్ అండ్ లైఫ్స్ లెసన్స్' (Faith and Life's lessons)
3. ఎథిక్స్ వర్సెస్ రిలీజియన్: క్యాన్ మోరాలిటీ ఎక్సిస్ట్ వితౌట్ గాడ్?' (Ethics Vs Religion: Can Morality exist without God?)



**– ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్ కుమార్**

ఫార్మర్ వైస్ ఛాన్సలర్. వీరు ప్రగతి నగర్, కూకట్‌పల్లి ఇజియఫ్‌కు అటెండ్ అవుతున్నారు.



# రాబోయే తుఫాను

## (జెఫన్యా 1:1-2:3 అధ్యయనం)

ప్రకృతిలో తుఫాను వస్తే ఎంత భయంకరంగా ఉంటుందో మనందరికీ తెలుసు! గాలి, వాన, పిడుగులు... అన్నీ కలిసి విలయం సృష్టిస్తాయి. అలాగే, దేవుడు కూడా తన ప్రజల పాపాల మీద తీర్పు అనే ఒక భయంకరమైన “తుఫాను”ను పంపించబోతున్నాడని జెఫన్యా ప్రవక్త ద్వారా మనకు తెలియజేస్తున్నాడు. ఇది ముఖ్యంగా యూదా దేశంలోని ప్రజల గురించి. వాళ్ళు దేవుడిని మర్చిపోయి, బయటి దేశాల విగ్రహారాధనను, చెడు అలవాట్లను అనుసరించడాన్ని దేవుడు సహించలేకపోయాడు. ఈ తీర్పు, బబులోను దండయాత్ర రూపంలో రాబోతుందని, అది ఆ దేశాన్ని శుద్ధి చేస్తుందని చెప్పుకొచ్చాడు. ఈ ప్రవచనం ఐదు ముఖ్యమైన భాగాలుగా విభజిస్తే, ఆ రాబోయే దైవిక కోపం ఎందుకు, ఎలా వస్తుంది, దానికి మనం ఎలా స్పందించాలి అనేది అర్థమవుతుంది.

### 1. తీర్పు ప్రకటన (1:1-3)

ప్రవచనం మొదట్లోనే, యూదా దేశం మీద రాబోయే తీర్పును, అంటే బబులోను చెరను గురించి దేవుడు ప్రకటిస్తున్నాడు. నా తీర్పు ప్రజలనూ, పశువులనూ, ఆకాశంలోని పక్షులనూ, సముద్రంలోని చేపలనూ కూడా తుడిచివేస్తుందని దేవుడు చెప్తున్నాడు. నోవాహు కాలంలో వచ్చిన మహా వరదను గుర్తుచేసేలా ఈ మాటలు, రాబోయే వినాశనం ఎంత భయంకరంగా, సమగ్రంగా ఉంటుందో తెలియజేస్తున్నాయి. పాపపు పని చేసే వాళ్ళు చెత్తకుప్పలు అయిపోతారని, భూమి మీద నుండి మానవాళి తుడిచివేయబడుతుందని, దీని ద్వారా దేవుడు భూమి మీద నుండి పాపాన్ని పూర్తిగా నిర్మూలిస్తాడని ఈ మాటలు వివరిస్తున్నాయి.

### 2. అర్హమైన తీర్పు (1:4-6)

ఈ తీర్పు కేవలం సృష్టిని నాశనం చేయడమే కాదు, విగ్రహారాధనకు వ్యతిరేకంగా తీసుకునే కఠినమైన చర్య అని ఈ భాగం స్పష్టం చేస్తుంది. యెహెజ్కేలు 14:1-8 లో చెప్పినట్లుగా, దేవుడిని బాధించే “తడబడే రాళ్ళు” అయిన విగ్రహాలు నాశనం చేయబడతాయి. జెఫన్యా కాలంలో

యూదా దేశంలో విగ్రహారాధన విపరీతంగా ఉండేది. ఆ కాలంలో ప్రజలను ఆకర్షించిన రెండు ముఖ్యమైన అబద్ధ దేవతల పేర్లను ప్రవక్త పేర్కొన్నాడు:

* బయలు (Baal): కనానీయుల వర్షపు దేవుడు (జెఫన్యా 1:4).
* మల్కోము (Milcom or Molech): అమ్మోనీయుల భయంకరమైన దేవుడు, శిశుబలితో సంబంధం కలిగియున్నాడు (1 రాజులు 11:33, ఆమోసు 5:26, యిర్మీయా 19:13, 32:29, 2 రాజులు 23:10).

యూదా ప్రజలు ఈ విగ్రహాలను పూజిస్తూనే, తాము దేవుడిని భక్తిగా సేవిస్తున్నామని తప్పుగా నమ్మారు. కానీ, దేవుడు తన మహిమను విగ్రహాలతో పంచుకోడు. ఆ విగ్రహారాధన దేవుడిని నేరుగా అవమానించడమే. ప్రజలు "చేసే పాపాలు" (విగ్రహాలను పూజించడం) మరియు "చేయని పాపాలు" (దేవుడిని నిర్లక్ష్యం చేయడం) రెండింటికీ దోషులయ్యారు.

### 3.తీర్పు ప్రకటించబడింది (1:7-9)

జెఫన్యా ప్రవక్త, దేవుని ఆజ్ఞలను ధిక్కరించిన వారిపై తీర్పును మరింత స్పష్టంగా ప్రకటిస్తున్నాడు. యూదులకు పరిచితమైన పురాతన ఆచారాలను (1 సమూయేలు 9:11) ఉపయోగిస్తూ, దేవుడు ఒక విచిత్రమైన విందుకు యజమానిగా ఉన్నాడని వర్ణిస్తున్నాడు. అయితే, ఈ విందుకు అతిథులు బాబిలోనియులైతే, బలులు (యజ్ఞాలు) యూదా ప్రజలే. సాధారణంగా రాజకుటుంబం, మత నాయకులు వంటివారు ఇలాంటి విందులకు గౌరవ అతిథులుగా ఉంటారు. కానీ ఇక్కడ, వారే బలి అయ్యే దుస్థితిని వర్ణిస్తున్నాడు.

ఇది దేవుని వాక్యాన్ని విస్మరించి, విదేశీ వస్త్రాలు ధరించడం, విదేశీ దేవతలను పూజించడం వంటి అన్యదేశ ఆచారాలను అనుసరించిన యూదా నాయకులు, అధికారులు పట్ల దేవుడు ప్రకటించే శిక్షకు ప్రతీక. (సంఖ్యా 15:38, ద్వితీ 22:11-12).

క్రీ.పూ. 609లో రాజైన యోషీయా మరణించిన తర్వాత, యూదా చివరి నలుగురు రాజులు బలహీనులుగా మారి, యూదా దేశంలో ఈజిప్ట్ ఆచారాలను అనుసరించారని ఈ ప్రవచనం తెలియజేస్తుంది. దేవునిపై నమ్మకం ఉంచడానికి బదులుగా, వారు విదేశీ సంబంధాలపై ఆధారపడ్డారు. ఇది వారి పతనానికి దారితీసింది. ఆ రాజుల నాయకత్వంలో, వారి సేవకులలో హింస, మోసం, అవినీతి రాజ్యమేలాయి.

### 4. జెఫన్యా ప్రవక్త చెప్పిన తీర్పు (1:10-18)

జెఫన్యా, బబులోనీయుల దాడిని చాలా భయంకరంగా వర్ణిస్తాడు. దేవుడు వారిని తన "అతిథులు"గా పిలుస్తూ, ఒక బలి అర్పణకు వస్తున్నట్లు చెబుతాడు. అంటే, వాళ్లు వచ్చి యెరూషలేమును దోచుకుని, నాశనం చేస్తారని అర్థం.

* **మొదటి హెచ్చరిక:** బబులోనీయులు వస్తున్నారని మొదటి హెచ్చరిక "చేపల గుమ్మం" (Fish Gate) దగ్గర వినిపిస్తుంది. ఇది నగరంలో ఉత్తర భాగంలో ఉండే ఒక ముఖ్యమైన ద్వారం. ఇక్కడ వ్యాపారులు, చేపలు పట్టేవారు వ్యాపారం చేసేవారు. ఈ హెచ్చరిక "కొత్త పావు" లేదా "రెండవ పావు" (new quarter/second quarter) అని పిలిచే ధనిక ప్రాంతం అంతటా వినిపిస్తుంది. ఈ ప్రాంతంలో, పేదల కష్టార్జితంతో కట్టుకున్న విలాసమైన ఇళ్లలో ధనవంతులు నివసిస్తున్నారు. రాజు యోషీయా ప్రవక్త్రి హుల్దాను సంప్రదించడానికి తన మనుషులను ఈ ప్రాంతానికే పంపాడు కాబట్టి, ఈ చెడు వార్తలు ఇక్కడి నుంచే మొదలవుతాయని చెప్పొచ్చు.
* **నగరంలో విధ్వంసం:** బబులోనీయులు మార్కెట్లను (Maktesh), వ్యాపారులు, బ్యాంకులు ఉండే చోట్లను, ధనిక ప్రాంతాలను నాశనం చేస్తారు. "దేవుడు తమను పట్టించుకోడని" అనుకున్న వాళ్లంతా, తాము దాక్కుని చేసిన పనులకు కూడా శిక్ష అనుభవిస్తారు. వాళ్ల నిర్లక్ష్యాన్ని, కలుషితమైన మద్యంతో పోలుస్తాడు. అంటే, అసత్య

ఆరాధన వల్ల నగరం ఎలా కలుషిత మైందో చెబుతున్నాడు.

* **ధనవంతుల నాశనం:** ఈ తీర్పు ముఖ్యంగా ధనవంతులపైనే పడుతుంది. వాళ్ల ఆస్తులన్నీ దోచుకోబడతాయి, ఇళ్లు కూల్చివేయబడతాయి, ద్రాక్షతోటలు నాశనం చేయబడతాయి. ఈ తీర్పు చాలా వేగంగా, భయంకరంగా ఉంటుంది. బందీల ఏడుపులు, సైనికుల కేకలు, రక్తం ఏరులై పారడం వంటి దృశ్యాలు ఉంటాయి. వాళ్లకున్న ధనమంతా ఈ దేవుని కోపం నుంచి వాళ్లను కాపాడలేదు.

## 5. దేవుని పిలుపు: పశ్చాత్తాపం చేసుకోండి! (2:1-3)

ఇశ్రాయేలీయులకు ప్రవక్త కోపం తగ్గుముఖం పట్టలేదు. దానికి బదులుగా, దేవుని తీర్పు తప్పించుకోవడానికి యూదా ప్రజలు పశ్చాత్తాపం చెందాలని ఆయన గట్టిగా పిలుపునిచ్చారు. ఈ పిలుపు చాలా స్పష్టంగా, సూటిగా ఉంది. ప్రజలు ఆయనను వెదకాలి, నీతిని వెదకాలి, వినయంతో ఉండాలి. ఈ సందేశం కాలాతీతమైనది. దుష్టత్వం, అవినీతి, నైతిక పతనం రాజ్యమేలే కాలంలో జీవిస్తున్న వారందరినీ, ప్రభువు వైపు తిరగమని, ఆయనతో వ్యక్తిగత సంబంధాన్ని కొనసాగించమని, నీతిని అనుసరించమని, దేవుని ముందు వినయంగా జీవించమని ఈ సందేశం ప్రోత్సహిస్తుంది.

## 6. నేటి కాలానికి అన్వయం

నేటి ప్రపంచంలో, విగ్రహారాధన అనేక రూపాల్లో కనిపిస్తుంది. ఇది కేవలం విగ్రహాలను లేదా అబద్ధ దేవతలను పూజించడం మాత్రమే కాదు. వస్తు వ్యామోహం, సెలబ్రిటీల మోజు, అధికారం, హోదా కోసం తాపత్రయం కూడా విగ్రహారాధన కిందకే వస్తాయి. బాహ్యమైన విషయాలపై, పైపై విజయాలపై ఎక్కువ దృష్టి పెట్టినప్పుడు, నిజంగా ముఖ్యమైన వాటిని – మన నైతిక, ఆధ్యాత్మిక విలువలను – మర్చిపోవచ్చు.

మరొక సమస్య, సంస్కృతి, నైతిక విశిష్టతలను కలపడం. ఇది ముఖ్యమైన సత్యాలను నీరు గారుస్తుంది. జెఫన్యా కాలంలో వలె, మన ముఖ్య సూత్రాలకు, అవి మతపరమైనవి కాని, నైతికమైనవి కాని, కట్టుబడి ఉండటం యొక్క ప్రాముఖ్యతను మనం గుర్తుంచుకోవాలి.

జెఫన్యా సందేశం నేటికీ ఎంతో సత్యం. మన సమాజంలో న్యాయాన్ని, దయను, నైతిక ప్రవర్తనను నిలబెట్టడానికి మనం కృషి చేయాలి. అలా చేయడం ద్వారా, సమగ్రత, గౌరవం, పరస్పర మద్దతుకు విలువనిచ్చే సమాజాన్ని మనం సృష్టించవచ్చు.

## 7. ముగింపు

జెఫన్యా ప్రవక్త గ్రంథంలోని మొదటి రెండు అధ్యాయాలు (1:1-2:3) దేవుని తీర్పు గురించి, యూదా దేశంలో పాతుకుపోయిన అన్య మతాల ఆచారాలు, నైతిక పతనం గురించి శక్తివంతమైన కథనాన్ని తెలియజేస్తాయి. ఈ ప్రవచనం, దేవుని కోపానికి ప్రతీకగా, అన్నింటినీ తుడిచిపెట్టే సంపూర్ణ విధ్వంసం గురించి హెచ్చరిస్తుంది. విగ్రహారాధనను ఖండించడం, మత నాయకుల వైఫల్యం, పశ్చాత్తాపం యొక్క ఆవశ్యకత ఈ భాగంలోని ముఖ్యమైన ఇతివృత్తాలు.

ఈ సందేశం మన విలువలను పునరాలోచించుకోవడానికి, నీతిని అనుసరించడానికి, న్యాయం మరియు వినయంతో కూడిన సంస్కృతిని ప్రోత్సహించడానికి మనల్ని ప్రేరేపిస్తుంది. ఈ శాశ్వతమైన హెచ్చరికలను ఆలకించడం ద్వారా, మనం నైతిక పతనాన్ని, దానివల్ల వచ్చే "రాబోయే తుఫాను"ను తప్పించుకోవడానికి ప్రయత్నించవచ్చు.

జెఫన్యా ప్రవచనం, దేవుని నుండి దూరం జరగడం, నైతిక క్షీణత యొక్క పరిణామాల గురించి మనల్ని హెచ్చరిస్తుంది. ఇది పశ్చాత్తాపం యొక్క అవసరాన్ని, విగ్రహారాధన, నాయకుల వైఫల్యం యొక్క ప్రమాదాలను నొక్కి చెబుతుంది. ఈ పాఠాలను మనసులో పెట్టుకుని, నైతిక క్షీణతను, తద్వారా సంభవించే గందరగోళాన్ని నివారించడానికి మనం కృషి చేయవచ్చు.

– రాజ్ కుమార్ కె, స్టాఫ్, రాజేంద్ర నగర్



# లేయా

## (పరిపక్వత కలిగిన పత్ని)

ప్రతి క్రైస్తవ స్త్రీకి తన కుటుంబాన్ని కట్టుకునే విషయంలో నాలుగు ముఖ్యమైన దైవిక లక్షణాలు అవసరం – అవి విశ్వాసం, విధేయత, వినమ్రత, వివేచన. మన జీవితంలో కష్టాలు, క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడే, కుటుంబాన్ని కట్టుకునే సత్తా మనకు ఉందా లేదా అనేది బయటపడుతుంది. కుటుంబానికి యజమాని భర్త అయినప్పటికీ, ఇంటి అవసరాలు, సంబంధ బాంధవ్యాలు మాత్రం ఎక్కువగా భార్య మీదే ఆధారపడి ఉంటాయి.

ఈ నాలుగు స్తంభాలలాంటి లక్షణాలను ఒక స్త్రీ ఎంత ఎక్కువగా అలవర్చుకుంటే, అంత గొప్ప ఫలితాలను, దేవుని ఆశీర్వాదాలను తన కుటుంబంలో చూడగలుగుతుంది. ఈ స్తంభాలలో ఏ ఒక్కటి బలహీనపడినా, సాతాను మన కుటుంబం లోకి సులభంగా ప్రవేశించడానికి అవకాశం దొరుకుతుంది. కుటుంబాన్ని పోషించడంలో భర్త పాత్ర ముఖ్యం అయితే, కుటుంబాన్ని కట్టడంలో భార్య పాత్ర అత్యంత కీలకం. ఈ పనికి పెద్ద పెద్ద చదువులు, డిగ్రీలు అక్కర్లేదు. కానీ, ఈ నాలుగు దైవిక మూల స్తంభాలు ఉంటే, చదువు లేని విశ్వాసి అయిన స్త్రీ కూడా తన కుటుంబాన్ని క్రీస్తులో బహు అందంగా నిర్మించు కోగలదు.

### లేయా: బాధలో ఎదుగుదల

ఆదికాండము 29, 30 అధ్యాయాలను మనం లోతుగా చదివితే, యాకోబు భార్య లేయా తన కుటుంబాన్ని ఎలా కట్టుకుందో స్పష్టంగా అర్థమవుతుంది. లాబానుకు ఇద్దరు కుమార్తెలు. పెద్దది లేయా, చిన్నది రాహేలు. లేయా జబ్బు కండ్లు గలది. కానీ రాహేలు రూపవతియు, సుందరియునై యుండెను. యాకోబు, రాహేలును ప్రేమించి ఆమె కోసం ఏడు సంవత్సరాలు కొలువు చేసినప్పటికీ, లాబాను మోసం చేసి, యాకోబుకు లేయాను ఇచ్చి పెళ్లి చేస్తాడు. ఆ తర్వాత, మరో ఏడు సంవత్సరాలు యాకోబు కొలువు చేసిన తరువాతే, అతనికి రాహేలును కూడా భార్యగా ఇస్తాడు. అయితే, యాకోబు లేయా కంటే రాహేలును ఎక్కువగా ప్రేమించాడు. బైబిల్‌లో చెప్పినట్లుగా, లేయా ద్వేషింపబడింది.

ఆదికాండము 29:31లో, లేయా ద్వేషింప బడుట యెహోవా చూచెను అని వ్రాయబడి ఉంది. భర్త ప్రేమించకపోవడం, బదులుగా ద్వేషించడం అనేది ఏ స్త్రీకైనా ఎంతో వేదన కలిగించే పరిస్థితి. సాధారణంగా ప్రతి స్త్రీకి ప్రాథమిక అవసరం, ముఖ్యమైన కోరిక ఏంటంటే, ప్రేమించబడటం. కానీ లేయాకు ఆ భాగ్యం దక్కలేదు. ఆమె ద్వేషింపబడుతూనే ఉంది. ఈ పరిస్థితిని బట్టి ఆమె ఎంత వేదన, నొప్పి, బాధ, దు:ఖం, శ్రమ అనుభవించి ఉంటుందో మనం ఊహించవచ్చు. అయినప్పటికీ, తన భర్తను ప్రేమిస్తూనే, భర్త ప్రేమకోసం పరితపించింది. కానీ, తన భర్తను వదిలి వెళ్ళిపోవడానికి ఇష్ట పడలేదు.

యాకోబు లేయాను ప్రేమించలేదు, ఆమెతో సరిగ్గా కాపురం చేయలేదు. లేయా ద్వేషింప బడుట చూసి, యెహోవా ఆమె గర్భము తెరిచెను, కానీ రాహేలు గొడ్రాలిగా ఉండిపోయింది. లేయాకు రూబేను, షిమ్యోను, లేవి, యూదా, ఇశ్శాఖారు, జెబూలూను అనే ఆరుగురు కుమారులు జన్మించారు. ఆమె ప్రతి కుమారునికి పేరు పెట్టేటప్పుడు, తన భర్త ప్రేమ కోసం ఎంతగా ఆశపడిందో చెప్పింది. అయితే, తన వేదనకరమైన పరిస్థితి అంతటిలో, ప్రతిసారీ ఆమె దేవుని వైపు మాత్రమే చూసింది మరియు తన పరిస్థితిని బట్టి దేవునిని స్తుతించగలిగింది! జీవితాంతం ప్రేమించబడని స్థితిని అనుభవిస్తూనే, ఆ క్లిష్ట పరిస్థితుల మధ్య లేయా తగ్గించుకోవడం, ఓర్చుకోవడం నేర్చుకుంది.

## దేవుని ప్రతిఫలం

తన బాధలో ఓర్చుకుంటూ, తగ్గింపుతో పరిపక్వత చెందిన లేయాకు దేవుడు గొప్ప బహుమతినిచ్చాడు. ఆమె చూపించిన సహనం, ఓర్పు, దీనత్వం దేవుని ఎంతగానో మెప్పించాయి. అందుకే, యేసుప్రభువు వారు లేయా కుమారుడైన యూదా గోత్రంలో జన్మించడం, ఆమె ఆరుగురు కుమారులను ఆరు ఇశ్రాయేలు గోత్రకర్తలుగా దేవుడు ఏర్పాటు చేసుకోవడం అనేది లేయాకు నిజంగా గొప్ప ఆశీర్వాదం.

ఆదికాండము 47:7-9 వచనాల్లో మనం గమనిస్తే, ఐగుప్తులో ఫరో 'నీవు జీవించిన సంవత్స రాలు ఎన్ని?' అని యాకోబును అడిగినప్పుడు, యాకోబు ఇచ్చిన జవాబు ఆలోచింపజేస్తుంది. ఆయన తన జీవితాన్ని "నేను ప్రయాణం చేసిన సంవత్సరాలు 130, నేను జీవించిన సంవత్సరాలు కొంచెముగాను, దు:ఖ సహితమైనవిగాను ఉన్నవి" అని చెప్పాడు. బహుశా, యాకోబు ఆ సమయంలో తాను చేసిన తప్పులన్నిటినీ గుర్తు చేసుకుని ఉండవచ్చు. ముఖ్యంగా, లేయాను జీవితాంతం ప్రేమించలేక ద్వేషించినందుకు కలిగిన అపరాధభావం, తన తండ్రిని, అన్నయైన ఏశావును మోసం చేయడం, అలాగే లాబాను చేసిన మోసం వంటివన్నీ ఆయన మనసులో మెదిలి ఉండవచ్చు. లేయా తన భర్త ప్రేమ కోసం ఎంతగానో పరితపించినా, యాకోబు బ్రతికి ఉండగా తన తప్పును గుర్తించి ఆమెను క్షమాపణ అడగలేదేమో, చివరికి లేయా తన భర్త ప్రేమను పొందకుండానే చనిపోయి ఉండవచ్చు.

## ముగింపు

సమూయేలు 16:7లో చెప్పినట్లుగా, మను ష్యులు పైరూపాన్ని చూస్తారు, కానీ యెహోవా హృదయాన్ని చూస్తాడు.

* మనకు బాధ, దు:ఖం, నొప్పి, వేదన కలిగించేవారు మన చుట్టూ, మనతోనే ఉంటారు. అయినా, మనం అవమానాన్ని లెక్కచేయకుండా, సిలువను సహిస్తూ, దేవునివైపు చూద్దాం. ఆయన పాదాల చెంత ఓర్పు, సహనం, దీనత్వం, తగ్గింపు అల వర్చుకుందాం.
* ఏదైనా ఒక బాధను బట్టి పదేపదే కలత చెందుతూ కూర్చుంటే, మనం దేవుని చిత్తం నుండి పక్కకు తొలగిపోయే ప్రమాదం ఉంది. ఎక్కువగా బాధపడితే ఆనారోగ్య సమస్యల బారినపడతాం కూడా.
* స్త్రీలుగా, మనం వాక్యధ్యానం-ప్రార్థనకు ప్రాధాన్యత ఇస్తూ, ఏ పని చేస్తున్నా సరే వాక్యాన్ని గురించి ఆలోచించడం అలవాటు

చేసుకుందాం.

* మనం సంతోషంగా ఉండాలా, బాధపడాలా అనేది మన వ్యక్తిగత నిర్ణయం మీదే ఆధారపడి ఉంటుంది. ఇతరులు మనల్ని గౌరవించాలని, అర్థం చేసుకోవాలని ఆశించే బదులు, ఇతరులకు అవసరమైన వాటిని ఇచ్చేవారిగా ఉందాం, కానీ ఇతరుల నుండి ఏమీ ఆశించవద్దు.
* మనల్ని ఇబ్బంది పెట్టేవారిని త్వరగా క్షమించడానికి ప్రయత్నిద్దాం. అలాంటి మంచి మనసు మనకు దేవుడే ఇవ్వాలని ప్రార్థన చేద్దాం, అభ్యాసం చేద్దాం.

లేయా గురించి ఒక్క మాటలో చెప్పాలంటే, ఆమె జీవితం ప్రేమరాహిత్యంతో కూడుకున్నది. కానీ, చివరికి ప్రేమామయుడైన క్రీస్తు రాకకు కారణమైన ఘనతను పొందుకుంది.

**– త్రివేణి శ్రీను,** రామాంతపూర్ జోన్, హైదరాబాద్

* * * * * *

**నూతన శీర్షిక**



# మీ ప్రశ్న - మన జవాబులు

నవంబర్ నెల నుండి మన "విద్యార్థి వెలుగు" మ్యాగజైన్‌లో "మీ ప్రశ్న – మన జవాబులు" అనే శీర్షిక ప్రారంభమైంది. మీకు క్లిష్టంగా అనిపించిన ఏ ప్రశ్ననైనా మీరు రాయవచ్చు. వాటిని మేము 'విద్యార్థి వెలుగు'లో ప్రచురిస్తాం. ప్రచురించిన ప్రశ్నలకు సమాధానాలను కూడా మీరు పంపవచ్చు.

**నవంబర్ నెల ప్రశ్న:**

మీరు మెంటీల (mentees) తో సంవత్సరమంతా చర్చించాల్సిన అంశాలు ఏమిటి? క్లుప్తంగా రాయండి.



**డిసెంబర్ నెల ప్రశ్న:**

క్రిస్మస్ కార్యక్రమాలలో దేవుని అంగీకరించిన విద్యార్థులను ఎలా ఫాలో అప్ చేయాలి?




మీ సమాధానం డిసెంబర్ **10వ** తేదీలోగా పంపించగలరు.

**మీరు మీ మెంటీస్‌తో మాట్లాడే విషయాలు**

1. **చదువులు, పరీక్షల గురించి:** వాళ్ల చదువు, పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారు, చదువులో వాళ్లకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని వివరంగా తెలుసుకుంటాను.
2. **కుటుంబ విషయాలు:** వాళ్ల ఇంట్లో వాళ్ల గురించి, అంటే అమ్మ, నాన్న ఆరోగ్యం, అన్నదమ్ముల, అక్కాచెల్లెళ్ల చదువులు ఇలా కుటుంబ సభ్యుల క్షేమ సమాచారాలు అడుగుతాను.
3. **క్వైట్ టైమ్ గురించి:** క్రమం తప్పకుండా దేవునితో గడిపే సమయం (క్వైట్ టైమ్) గురించి మాట్లాడుకుని, కలిసి ఒక లేఖన భాగాన్ని చదివి, దాని గురించి చర్చిస్తాము.
4. **సువార్త మరియు ప్రార్థన:** వాళ్లు సువార్త చెప్పాలనుకుంటున్న స్నేహితుల పేర్లు రాసుకుని, వాళ్ల కోసం కలిసి ప్రార్థన చేస్తాము.
5. **లేఖనాలు నేర్చుకోవడం:** దేవుని వాక్యాన్ని కంఠస్థం చేయడానికి మేము ఒక అసైన్‌మెంట్ తీసుకుంటాము. ఇప్పటివరకు మూడు కీర్తనలు నేర్చుకున్నాము.

**– డా. మెర్సీ సుజాత,** తార్నాక


**శిష్యత్వంలో పాటించాల్సిన 10 సూత్రాలు**

మైక్రో ప్రేయర్ సెల్స్ (యంపిసి) లోని విద్యార్థులతో గ్రాడ్యుయేట్స్ ఏం మాట్లాడాలి, ఎలా మాట్లాడాలని చాలామంది ఆలోచిస్తుంటారు. ముఖ్యంగా ఇంటర్నేషనల్ ఫెలోషిప్ ఆఫ్ ఎవాంజెలికల్ స్టూడెంట్స్ (IFES) సంస్థ, కొత్తగా రక్షింపబడిన విద్యార్థులను ఆత్మీయంగా బలపరచి, క్రీస్తుకు శిష్యులుగా తయారుచేయడానికి ఈ 10 సూత్రాలను సూచించింది.

1. **విద్యార్థుల పట్ల దేవుని అద్భుతమైన ప్రేమను తెలియపరచాలి:** కొత్తగా రక్షణ పొందిన వాళ్లకు దేవుని ప్రేమ ఎంత గొప్పదో, ఆయన ప్రణాళికలు ఏంటో చెప్పాలి. లోకంలో మనుషులు మనిషి రూపాన్ని, చదువును, డబ్బును చూసి ప్రేమిస్తారు, గౌరవిస్తారు. కానీ దేవుని ప్రేమ వీటన్నిటి కంటే మించినది. ఆయన ప్రేమ మనపట్ల శాశ్వతమైనది. తప్పి పోయిన కుమారుడిపై తండ్రి చూపించిన ప్రేమలాంటి బైబిల్ సందేశాలను, యంపిసిలలో కలిసినప్పుడు వాళ్లకు అర్థమయ్యేలా బోధించాలి.
2. **దేవుని పనిలో (Mission of God) భాగం కావాలని ప్రోత్సహించాలి:** ఈ లోకంలో దేవుడు పని ఉంది. గాయపడిన ప్రజల మధ్య దేవుని ప్రేమను, ఆదరణను ప్రకటించడానికి దేవుడు మనల్ని పిలిచాడు. ఆ సంకల్పాలను గుర్తించి పనిచేయాలని విద్యార్థులకు బాగా నూరిపోయాలి.
3. **ప్రార్థనలో దేవుని చిత్తాన్ని, స్వరాన్ని గుర్తించ డం నేర్పించాలి:** క్రమం తప్పకుండా ప్రార్థన, వాక్య ధ్యానం చేయడం ద్వారా దేవుని సంకల్పాలను గుర్తించవచ్చో బోధించాలి. విద్యార్థులు దేవునికి దగ్గరగా జీవించడం అలవాటు చేసుకుంటే, ఆయన సంకల్పాలను కచ్చితంగా గుర్తిస్తారు.
4. **దేవుని వాక్యాన్ని వ్యక్తిగతంగా, సమిష్టిగా చదివి, అర్థం చేసుకోవడం నేర్పించాలి:** ఒంటరిగా చదవడం, గ్రూపుగా కలిసి చదవడం, అలా చదివిన వాక్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలి, మన జీవితానికి ఎలా అన్వయించుకోవాలో వాళ్లకు నేర్పించాలి.
5. **సహవాసం యొక్క విలువను తెలియజేయాలి:** విద్యార్థులు యంపిసిలలో భాగంగా బైబిల్ స్టడీస్‌కి వెళ్ళడం, స్థానిక చర్చికి క్రమం తప్ప కుండా హాజరుకావడం ఎంత ముఖ్యమో చెప్పాలి. ఇలాంటి సహవాసం ద్వారా వాళ్లు ఆధ్యాత్మికంగా పరిణితి చెందుతారని వివరించాలి.
6. **వ్యక్తిగత సువార్త ఎలా ప్రభావవంతంగా చేయాలో నేర్పాలి:** తోటి విద్యార్థులకు, స్నేహితులకు క్రీస్తు గురించిన సువార్తను ఎలా పంచుకోవాలో, ఎలా వ్యక్తిగతంగా సాక్ష్యం ఇవ్వాలో వివరంగా నేర్పించాలి.
7. **యేసు ప్రభువులో ఎదుగుతున్నప్పుడు సరిదిద్దుకోవాల్సిన విషయాలను నేర్పించాలి:** మనం క్రీస్తును పోలి ఎదిగే కొద్దీ, మన జీవితంలో సరిదిద్దుకోవాల్సిన అలవాట్లను, ఆలోచనలను ఎలా గుర్తించి, సరిచేసుకోవాలో నేర్పించాలి.
8. **విద్యార్థి జీవితం పట్ల దేవుని ప్రత్యేక పిలుపును గ్రహించాలి:** ఆ విద్యార్థి జీవితంలో దేవుడు ఏం చేయాలను కుంటున్నాడో మీరు గ్రహించి, ఆ ప్రకారం వాళ్లను దేవునిలో నడిపించాలి.
9. **గాయపడిన హృదయాలను దేవుడు బాగు చేస్తాడని చెప్పాలి:** ఎలాంటి పాపంలో చిక్కుకు పోయినా, ఎలాంటి బాధలో ఉన్నా దేవుడు విడిపించగలడు, బాగుచేయగలడు, సరైన మార్గంలో నడిపించగలడు అనే విశ్వాసాన్ని వాళ్లలో నింపాలి.
10. **విశ్వాస జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను జయించడం నేర్పించాలి:** క్రైస్తవ జీవితం అంటే ఎప్పుడూ సులువుగా ఉండదు. ఇబ్బందులు, పరీక్షలు, నిందలు వస్తాయి. అలాంటి సమయాల్లో దేవుని శక్తితో, వాక్య సహాయంతో వాటిని ఎలా జయించవచ్చో నేర్పించాలి.

ఈ పది అంశాలను క్రమం తప్పకుండా విద్యార్థులతో మాట్లాడి, వాళ్లకు మంచి తర్ఫీదు ఇవ్వాలి.

**– దాసరి రాజేష్**



# డాక్టర్ సూసీ రిజ్‌హార్ట్

## (1868 - 1908)

లోకంలో ఎంతోమంది సాహసికుల గురించి వింటుంటాం. ఎత్తైన పర్వత శిఖరాలను అధిరోహించిన వారిని, తెలియని సముద్రాలను దాటిన వారిని గురించి చదివినప్పుడు ఆశ్చర్యపోతాం. కానీ, కొన్ని జీవితాలు చరిత్ర పుటల్లో మరుగున పడిపోతాయి. వారి ధైర్యం, త్యాగం, అచంచలమైన విశ్వాసం, ధృడ సంకల్పం వారి గురించి తెలిసిన వారికి మాత్రం తప్పక స్ఫూర్తినిస్తాయి. అలాంటి ఒక అద్భుతమైన, అసాధారణమైన వ్యక్తి డాక్టర్ సూసీ రిజ్‌హార్ట్.

ఆమె పేరు బహుశా చాలా మందికి తెలిసి ఉండకపోవచ్చు, కానీ ఆమె జీవితం ధైర్యానికి, విషాదానికి, అచంచలమైన మానవ సంకల్పానికి ఒక శక్తివంతమైన నిదర్శనం. ఇది కేవలం ఒక మిషనరీ కథ కాదు కాని అన్ని అడ్డంకులను అధిగమించి, ఊహించ లేని నష్టాన్ని సైతం తట్టుకుని నిలబడిన ఒక మేధావి, ఒక వైద్యురాలి అద్భుత గాథ.

### ప్రారంభ జీవితం, విద్య

డాక్టర్ సుసీ రిజ్‌హార్ట్ గారి ప్రారంభ సంవత్సరాలు, ఆమె భవిష్యత్తులో దేవుని సేవలో చూపబోయే గొప్ప శక్తికి బలమైన పునాది వేశాయి.

ఆమె 1868లో కెనడా దేశంలోని పశ్చిమ ఒంటారియోలో, ఒక ప్రముఖ విద్యావేత్త అయిన జె. ఎస్. కార్సన్, యం.ఏ., కుమార్తెగా జన్మించారు. ఆమె తండ్రి మార్గదర్శకత్వంలో లిబరల్ క్లాసికల్ విద్యను అభ్యసించారు. ఆ తర్వాత, కేవలం ఇరవై సంవత్సరాల వయసులోనే, ట్రినిటీ విశ్వవిద్యాలయం నుండి వైద్యశాస్త్రంలో పట్టభద్రురాలయ్యారు.

అంతేకాదు, "కెనడాలో వైద్యశాస్త్రంలో ఫస్ట్-క్లాస్ ఆనర్స్ పొందిన మొదటి మహిళ" అనే అరుదైన గౌరవాన్ని కూడా ఆమె దక్కించుకున్నారు. వైద్య విద్య పూర్తయిన తర్వాత, ఆమె ఒంటారియోలోని లండన్, న్యూబరీ ప్రాంతాలలో విజయవంతమైన డాక్టరుగా ప్రాక్టీస్ చేశారు.

మిషనరీ సేవకు వెళ్లకముందే, ఆమె వృత్తిపరమైన ఖ్యాతిని గడించారు.

అయితే, ఆమె జీవితంలో ముఖ్యమైన మలుపు ఏంటంటే, పదహారేళ్ల వయసు నుంచే 'ఉత్సాహ భరితమైన క్రైస్తవురాలు' గా, చర్చి కార్యక్రమాల్లో చాలా చురుగ్గా పాల్గొనేవారు. ఇదే ఆమెలో మిషనరీ సేవ పట్ల కోరికను రగిల్చింది. నిజంగా, ఆమె బాల్యం, యవ్వనం – ఈ పునాది సంవత్సరాలు, తాను త్వరలో స్వీకరించబోయే నిర్దిష్ట పిలుపునకు మార్గం సుగమం చేశాయి.

## దైవిక పిలుపు: టిబెట్‌కు మిషనరీ ప్రయాణం

టిబెట్‌కు పోయి దేవుని సేవ చేయాలని ఆమె తీసుకున్న నిర్ణయం, ఆమెకున్న బల మైన విశ్వాసానికి, జీవిత లక్ష్యానికి స్పష్టమైన ప్రతిబింబం. పెట్రస్ రిజ్‌హార్ట్ టిబెట్ గురించి చేసిన 'ఉత్తేజపరిచే ప్రసంగాలు' ఆమె మనసును కదిలించాయి. ఆ ప్రసంగాలే ఆమెను ప్రేరేపించి, 'టిబెట్ వెళ్లి సేవ చేయాలి' అనే ఓ ప్రత్యేకమైన పిలుపును ఆమెకు  అందించాయి.

సెప్టెంబరు 1894లో ఆమె పెట్రస్‌ను వివాహం చేసుకున్నారు. అదే సంవత్సరం చివరిలో, అంటే కొద్ది నెలలకే, వాళ్లిద్దరూ తూర్పు దేశాలకు బయల్దేరారు. ఈలోగా, వారిద్దరూ తమ విశ్వాసంలో మార్పు చెంది, అమెరికా వదిలి వెళ్ళే ముందు, వాషింగ్టన్‌లోని టాకోమాలో ఉన్న 'చర్చ్ ఆఫ్ క్రైస్ట్' లో చేరారు. ఇది టిబెట్‌కు ఆమె రాక, అక్కడి సమాజంపై తక్షణ ప్రభావాన్ని చూపడానికి వేదికను సిద్ధం చేసింది.

## అగ్ని పరీక్షలలో ఆమె ధైర్యం

1895 సంవత్సరం మధ్యలో, రిజ్ హార్ట్స్ దంపతులు మరియు వారి సహోద్యోగి విలియం నీల్ ఫెర్గూసన్ లుసార్ అనే చిన్న గ్రామానికి చేరుకున్నారు. ఈ లుసార్ గ్రామం అతిపెద్దదైన కుంబుమ్ బౌద్ధ ఆరామానికి సేవలు అందించేది. కుంబుమ్ ఆరామంలో దాదాపు 3,600 మంది సన్యాసులు నివసించేవారు. కొన్ని నెలల తరువాత ఫెర్గూసన్ గారు రిజ్ హార్ట్స్ దంపతుల నుండి విడిపోయారు.

రిజ్ హార్ట్స్ దంపతుల మొదటి లక్ష్యం ఏమిటంటే, టిబెట్ భాషను నేర్చుకోవాలి. ఆ తర్వాత టిబెటన్ల మధ్య దేవుని సేవ చేయాలి. వారి అంతిమ ఆశయం ఏంటంటే, లాసా అనే ప్రాంతానికి చేరుకోవాలి. లాసా అనేది టిబెట్ యొక్క రాజధాని. అది చాలా మారుమూల ప్రాంతం. 1846 నుండి ఎవ్వరూ, అంటే పాశ్చాత్యులు కూడా ఆ లాసా ప్రాంతాన్ని సందర్శించలేదు. ఇది చాలా నిషేధించబడిన ప్రాంతం.

వారు కుంబుమ్‌లోని లామాసరీకి చేరుకున్న వెంటనే దేవుని ఆశీర్వాదం లభించింది. డాక్టర్‌గా ఆమెకున్న వైద్య వృత్తికి అక్కడ చాలా గిరాకీ ఏర్పడింది. ఉన్నత అధికారులు మరియు పూజారులు డాక్టర్‌గా ఆమెను కోరుకున్నారు. దీనిని మిషన్ కార్యకలాపాలకు ఒక గొప్ప అవకాశంగా దేవుడు మార్చాడు. అయితే, 1895లో ఒక భయంకరమైన పరీక్ష వచ్చింది. పశ్చిమ చైనాలో మహమ్మదీయ తిరుగుబాటు మొదలైంది.

ఆ సమయంలో, రిజ్ హార్ట్స్ స్నేహితులు మరియు కుటుంబ సభ్యులు ఆమె భద్రత గురించి తీవ్ర ఆందోళన చెందారు. చాలా

నెలల పాటు, ఆమె నుండి ఎటువంటి ఉత్తరాలు రాలేదు. కేవలం అస్పష్టమైన వదంతులు మాత్రమే వినిపించాయి. తరువాత, ఆమెను తిరుగుబాటుదారులు అపహరించారని ఒక తప్పుడు వార్త కూడా వచ్చింది. ప్రపంచమంతా ఆమె ఇక లేరని భావించారు.

ఆ పోరాటం ముగిసిన తర్వాత అసలు నిజం వెలుగులోకి వచ్చింది. ఆమె అపహరణకు గురి కాలేదు. కానీ ధైర్యంగా ప్రమాదం మధ్యలో నిలబడ్డారు. "అత్యంత ప్రమాదకర పరిస్థితులలో, ఆ రక్తపాతం మరియు దోపిడీ నెలలన్నింటిలోనూ ఆమె అక్కడే ఉన్నారు. ఆమె యుద్ధరంగంలోనే ఉన్నారు. ఆమె గాయపడిన సైనికులకు సేవ చేశారు. కష్టకాలంలో విడిచిపెట్టకూడదని టిబెటన్లకు సహాయం చేస్తూ గడిపారు."

తిరుగుబాటు జరుగుతున్న సమయంలో, ఆమె తన ప్రధాన కార్యాలయాన్ని కుంబుమ్ యొక్క లామా-సుపీరియర్ ఇంట్లో ఏర్పాటు చేసుకున్నారు. ఇది "మిషన్ల చరిత్రలో అపూర్వమైన అనుభవం." ఆ సంస్కృతిలో ఒక క్రైస్తవ మహిళకు లభించిన అసాధారణమైన గౌరవానికి నిదర్శనం. ఆ తిరుగుబాటు సమయంలో ఆమె చూపిన ధైర్యం, రాబోయే ఇంకా పెద్ద వ్యక్తిగత పరీక్షలకు ఆమెను సిద్ధం చేసింది.

## విషాదం మరియు ఒంటరి ప్రయాణం

ఇది ఆమె జీవిత గాథలో అత్యంత భావోద్వేగ భరితమైన అధ్యాయం.

1898 వసంత కాలంలో "మిషనరీ పని టిబెట్ లోపలికి ఎంతవరకు సాధ్యమో'' కనుగొనాలని ఆమె నిర్ణయించుకున్నారు. అందుకే ఆమె తన భర్తతో కలిసి టిబెట్ అంతర్భాగానికి యాత్రను మొదలుపెట్టారు. దేవుని వాక్యం పంచుకోవాలనేది వారి ముఖ్య ఉద్దేశం. ప్రయాణంలో, వారు అనేక సంచార శిబిరాలలో దైవ గ్రంథాల ప్రతులను పంపిణీ చేశారు. వారి ప్రాథమిక లక్ష్యాన్ని నెరవేరుస్తూ ముందుకు సాగారు.

అయితే, ప్రయాణం మొదలైన కొద్దిసేపటికే వారి గైడ్‌లు వారిని విడిచిపెట్టి వెళ్ళిపోయారు. అతి త్వరలోనే వారి ప్రయాణం విషాదంగా మారింది. డాంగ్ లా పర్వతాల పాదాల వద్ద వారికి తీరని దు:ఖం కలిగింది. వారి చిన్నారి బిడ్డ మరణించాడు. ఆ బిడ్డను "ఒక పెద్ద బండరాయి క్రింద" ఖననం చేశారు. అది టిబెట్ అంతటా ఉన్న మొట్టమొదటి, ఏకైక క్రైస్తవ సమాధిగా నిలిచిపోయింది.

కొద్ది రోజుల తరువాత, పర్వతపు దొంగలు వారిపై దాడి చేసి వారిని నిరాశ్రయులను చేశారు. సహాయం కోసం ఆమె భర్త పెట్రస్ ఒక టిబెటన్ శిబిరానికి వెళ్ళి ఆయన తిరిగి రాలేదు. స్థానికుల చేతిలో ఆయన దారుణంగా హత్య చేయబడ్డారు.

పర్వత ప్రాంతంలో కొన్ని రోజులు డాక్టర్ రిజ్‌హార్ట్ ఆందోళనతో వేచి చూశారు. చివరికి తన భర్త మరణాన్ని తెలుసుకున్న ఆమె ఒంటరిగా చైనా సరిహద్దుకు ప్రయాణం మొదలుపెట్టారు. "పర్వత మార్గాలు, ప్రవాహాల మీదుగా అత్యంత ప్రమాదకరమైన ప్రయాణాన్ని" ప్రారంభించారు. దేవుని కృప వల్ల రెండు నెలల సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఆమె సురక్షితంగా చేరుకున్నారు. ఈ భయంకరమైన అనుభవాలను దేవుని

సహాయంతో ఆమె తట్టుకుని నిలబడ్డారు. అమెరికాకు తిరిగి వచ్చిన తర్వాత ఆమె తన అనుభవాలను ఒక శక్తివంతమైన సాక్ష్యంగా, సాధనంగా మార్చుకున్నారు.

## అలుపెరుగని సంకల్పం

1899లో అమెరికాకు తిరిగి వచ్చిన తర్వాత, డాక్టర్ సూసీ తన సమయాన్ని, శక్తిని టిబెట్ లక్ష్యం కోసమే పూర్తిగా అంకితం చేశారు.

ఆమె చేపట్టిన కీలక చర్యలు:

* **పుస్తక రచన:** "విత్ ది టిబెటన్స్ ఇన్ టెంట్ అండ్ టెంపుల్" (1901) అనే పుస్తకాన్ని రాశారు. ఇది "మిషనరీ సాహిత్యంలో అత్యంత అద్భుతమైన రచనలలో ఒకటిగా" గుర్తించ బడింది.
* **సువార్త ప్రచారం:** "టిబెట్‌లో సువార్త వ్యాప్తిపై ఆసక్తిని రేకెత్తించడానికి" ఆమె తనకున్న ప్రతిభను, శక్తిని అంతా ఉపయోగించారు. 1899లో సిన్సినాటిలో జరిగిన జూబ్లీ కన్వెన్షన్‌లో ప్రసంగించారు, అప్పటి నుండి చర్చిలలో ఆమె ప్రసంగాలకు నిరంతరం ఆహ్వానాలు అందు కుంటూ ఉండేది.
* **సేవకు పునరంకితం:** ఫారిన్ క్రిస్టియన్ మిషనరీ సొసైటీ ద్వారా, ఆమె టిబెట్‌లో ఒక కొత్త మిషన్‌ను ప్రారంభించడానికి నియమించబడ్డారు. స్ప్రింగ్‌ఫీల్డ్, ఇల్లినాయిస్‌లోని చర్చి, ఒంటారియోలోని క్రిస్టియన్ ఎండీవరర్స్ సంస్థ తరపున ప్రత్యేక ప్రతినిధిగా ఆమె మళ్ళీ వెళ్ళడానికి సిద్ధమయ్యారు.

ఆమె భవిష్యత్ ప్రణాళికలలో భాగంగా, చైనా-టిబెటన్ సరిహద్దులో ఉన్న ముఖ్యమైన పట్టణం టా-చియన్-లు దగ్గర ఒక ఆసుపత్రి, ఒక పాఠశాలను ప్రారంభించారు. అంతేకాదు, క్రమంగా లాసాకు వెళ్లే దారిలో మరిన్ని మిషన్ స్టేషన్లు స్థాపించాలని ఆమె ఆశించారు. ఆమె జీవిత కథ, విషాదం నుండి పుట్టిన అలుపెరుగని సంకల్పానికి ఒక శక్తివంతమైన నిదర్శనం.

## ముగింపు

డాక్టర్ సూసీ సి. రిజ్‌హార్ట్ గారి జీవితం చాలా గొప్పది. అది కేవలం ధైర్యం, విశ్వాసం, దృఢ సంకల్పముల కలయిక మాత్రమే కాదు, ఆమె జీవితం తన వ్యక్తిగత బాధను ఒక మంచి లక్ష్యంగా మార్చిన గాథ. ఆమె ఊహకందని నష్టాలను ఎదుర్కొన్నారు. తన కుటుంబాన్ని కూడా కోల్పోయారు. అయినా కూడా, టిబెట్ ప్రజల కోసం ఆమెకున్న అంకితభావం అస్సలు తగ్గలేదు.

ఆమె తన బాధను ఇతరులకు సేవ చేసే శక్తిగా మార్చుకున్నారు. అంతుకాకుండా, తన కుటుంబం చేసిన త్యాగం వృథా కాలేదని నిరూపించారు. క్రీస్తు సేవలో ఎన్ని కష్టాలొచ్చినా ఎదుర్కోవడానికి ఆమె తన జీవితాన్ని పూర్తిగా అంకితం చేశారు. డాక్టర్ సూసీ రిజ్‌హార్ట్ గారి జీవితం మనందరికీ ఎంతో స్ఫూర్తినిస్తుందని నేను ఆశిస్తున్నాను.

**(పై వ్యాసం ఇంటర్నెట్ వనరుల నుండి సేకరించబడినది)**

– **రూత్ వినయ్,** ప్రగతినగర్, హైదరాబాద్





# నెక్స్ట్ లెవెల్

ప్రభు క్రీస్తు నినుపోలి నడిచెదను
నీ త్యాగం – నీ అర్పణ – ధరణనుసరించెదము
నీవే మా మాదిరి – నీవేగా మా గురి
నీవేగా కాపరి – నీవేగా ఊపిరి
ఉద్యోగము కఠినులతో కూడా పనిచేయడం
సాహసము సత్యమునచ్చట జరిగించడం (2)
ఆదుకొనుము మమ్మును కూడా
దానియేలులా నడుచుటకు (2)

బాబురావు అన్న రాసి, పాడి నేర్పించిన ఈ పాటను ఎన్నిసార్లు విన్నా ఇంకా వినాలనిపిస్తుంది. సమర్పణ్ కారులో వెళ్తూ, ఆ పాట వింటూ డ్రైవ్ చేస్తున్నాడు. ఆ పాట వింటుంటే, దేవుడే తనతో మాట్లాడుతున్నట్లు, ప్రశ్నిస్తున్నట్లు అనిపించింది. పాటలో ఉన్న మాటలు అతన్ని కదిలించాయి. “నేనే, నీ మాదిరి అయితే, నీవు నన్నే అనుసరిస్తావు. నన్ను అనుసరించడం అంటేనే సత్యాన్ని అనుసరించడం” అనే మాటలు అతని గుండెను తాకాయి.

ఏసీ కారులో కూర్చున్నా, అతని నుదుటి నుండి చెమటలు పడుతున్నాయి. ముందుకు డ్రైవ్ చేయలేక, అతను కారును ఒక పక్కన ఆపాడు. తన ఖర్చీఫ్‌తో ముఖాన్ని తుడుచుకున్నాడు.

ఆఫీసులో చిన్న స్థాయి నుండి మేనేజరు స్థాయికి ఎదగడానికి తను వేసిన అడుగులు, తీసుకున్న నిర్ణయాలు... ఒక విశ్వాసికి తగినవి కావు. స్కూటర్ నుండి కాస్ట్లీ కారు, అద్దె ఇంటి నుండి అధునాతనమైన సొంత ఇంటికి మారే ఆత్రుతలో ఎక్కడో ముఖ్యమైన సత్యాన్ని జారవిడుచుకున్నాడు.

తన ఆత్మీయ జీవితం ఇప్పుడు ఒక యాంత్రికతను సంతరించుకున్నది. ఒకప్పుడు క్వయిట్ టైం చేసుకోకుండా బయటికి వెళ్ళని సమర్పణ్, ఇప్పుడు గుర్తొచ్చినప్పుడు ఏదో మొక్కుబడిగా చదవడం అలవాటైపోయింది. కొన్నిసార్లు, ఒక ఆదివారము నుండి మళ్ళీ ఇంకో ఆదివారము వరకు బైబిలును పట్టుకోని సందర్భాలు కూడా చాలానే ఉన్నాయి.

*******

పరిచర్య విషయానికి వస్తే ఒకప్పుడు ఎంతో బాధ్యతగా, మీనింగ్‌ఫుల్‌గా బైబిలు స్టడీస్ తీసుకోవడం, స్టూడెంట్స్‌ను కలవడం... క్యాంపుల్లో ప్రాక్టికల్ టాక్స్, డాక్ట్రిన్స్ తీసుకొనేవాడు. స్టూడెంట్స్‌కు తలలో నాలుకలాగా ఉంటూ, వారిని రిట్రీట్స్, క్యాంప్స్, ఫ్రీ కిస్మస్‌లకు ప్రోత్సహిస్తూ ... ఎంతో సమయాన్నీ, ధనాన్నీ వెచ్చించేవాడు.

కానీ ఇప్పుడు ఆ ఆశ, ఆసక్తి ఏమీ కనిపించడం లేదు. ఎందుకో ఆ ఉత్సాహం చల్లారిపోయింది. అప్పుడప్పుడు మొక్కుబడిగా బైబిలు చదివే

సమయంలో కూడా దేవుడు సూటిగా మాట్లాడిన సందర్భాలు లేకపోలేదు సమర్పణకు.

ప్రతిరోజూ సామెతలు చదివే అలవాటున్న సమర్పణ్‌కు, బైబిలు చదవాలని గుర్తొచ్చినప్పుడు, ఆ రోజు తేదీకి సంబంధించిన నంబరు గల సామెతలు చదివే సమయంలో అంటే 26 వ తేదీన సామెతలు 26:26 "సత్యమును అమ్మివేయక కొని యుంచుకొనుము" అనే వాక్యం సూటిగా అతని గుండెను తాకింది. ఆ రోజంతా అనీజీగా గడిపాడు. కానీ తర్వాత షరా మామూలే.

మరియొక సమస్య ఏమిటంటే, తన పని జరగడానికి చిన్న చిన్న అబద్ధాలు చాలా ఈజీగా చెప్పేవాడు. దేవుడు తన హృదయంలో, "నువ్వు చెప్పే విషయాలు నిజం కావు" అని గుర్తుచేసినప్పుడు, సమర్పణ్ తనను తాను ఇలా సరిపెట్టుకునేవాడు: "నేను చెప్పే అబద్ధాల వల్ల ఎవరికీ నష్టం లేదు కదా? అలాంటప్పుడు చిన్న అబద్ధాలు చెప్పి, పని జరిగేలా చూసుకోవడంలో పెద్ద తప్పు ఏముంది?" అని సరిపెట్టుకొనేవాడు.

*******

సమర్పణ్ ఆఫీసులో ఎవరికైనా డబ్బు అవసరమైతే, వెంటనే సహాయం చేసేవాడు. ఎవరైనా లీవులు అడిగితే అడగగానే ఇచ్చేవాడు, అందరితో చాలా ఫ్రెండ్లీగా ఉంటూ, వాళ్ళ బాధల్లో పాలుపంచు కునేవాడు. క్రిస్మస్ వచ్చిందంటే చాలు, తన స్థోమతకు తగ్గట్టుగా అందరికీ గ్రాండ్‌గా, అద్భుతంగా ట్రీట్ ఇచ్చేవాడు.

ఇలా చేస్తూండటం వలన అందరిలో ఒక మంచి క్రిష్టియన్‌గా తెచ్చుకున్నాడు. అవసరానికి సమర్పణ్ దగ్గర డబ్బు తీసుకున్నప్పుడల్లా, "క్రిష్టియన్ అంటే ఇలా ఉండాలి" అని వాళ్ళు కితాబు ఇచ్చేవారు. ఈ మాట విన్నప్పుడు సమర్పణ్‌కు బూస్ట్ కలపిన పాలు తాగినంత ఎనర్జీ వచ్చేది. "ఆఫీసులో నేను నా సాక్ష్యాన్ని బాగా కాపాడుకుంటున్నాను" అని బలంగా నమ్మడం అతనికి మామూలైపోయింది.

*******

మంచి పాటలు, వాక్యం వింటూ ఎంజాయ్ చేయడం మర్చిపోలేదు సమర్పణ్. ఆక్రమములోనే 'ప్రభు క్రీస్తు నిను పోలి నడిచెదం' అనే పాటను వింటూ, దేవుడే ఎదురుగా ఉండి ప్రశ్నించి నట్లయి, తబ్బిబ్బయి కారు దిగి చెమటను తుడుకుంటున్నాడు. అలాగే కారుకు ఆనుకొని ఐదు నిమిషాలూ తనను తాను తమాయించు కొన్నాడు. చల్లటి గాలి ముఖాన్ని తాకి, తను పడిన టెన్షన్ మొత్తాన్ని మోసుకెళ్ళిపోవడంతో కాస్త ఫ్రీ అయ్యాడు.


ఖర్చీఫ్‌ను జేబులో పెట్టుకుంటూ, "సత్యాన్ని ఉన్నది ఉన్నట్లుగా అనుసరించడం చాలా కష్టం. కాస్త అటు ఇటు అయినా... నేను ఎవరికీ ఏ కష్టం, నష్టం కలుగ జేయడం లేదే! పైగా కాసా కూస్తో ఇతరులకు సహాయం చేస్తున్నాను. చర్చికి వచ్చే లక్ష్మమ్మ వైద్యానికి ఏ మాత్రం ఆలోచించకుండా 50 వేలు ఇచ్చాను. ఆఫీసులో పని చేసే సుశీలమ్మ కూతురి పెళ్ళికి 30 వేలు ఇచ్చాను. దూరపు బంధువు కష్టాల్లో ఉంటే 20 వేలు ఇచ్చాను. దేవుడికిచ్చేవాటిలో ఎక్కడా వెనుకాడను. క్యాంపులకు, రిట్రీట్‌లకు సాయం చేస్తూనే ఉంటాను. షిట్! నేను చేస్తున్న ఈ పనులన్నీ నాకు తృప్తినిస్తున్నాయి. నేనెక్కడా అపరాధభావనతో లేను. నేనేమి తప్పు చేయలేదు. సమర్పణ్! గో ఎహెడ్! డోంట్ వర్రీ!" అని తనకు తాను ధైర్యం చెప్పుకొని కారెక్కాడు.

మొబైల్‌లో రూట్ మ్యాప్ చూసుకుంటూ ముందుకు ఉరికించాడు కారును. దుమ్ము రేపుకుంటూ వేగంగా దూసుకెళ్ళింది కారు. ఎందుకంటే, తన ఆఫీసులో ఉన్న ఒక ఖాళీగా ఉన్న ఒక పోస్ట్ భర్తీ చేయడానికి రెండు లక్షలు ఇస్తామన్న వారిని కలవడానికి వెళ్తున్నాడు.

"సత్యం సంత వీధులో పడి ఉంది" (యెషయా *59:14*).

**– చేగూడి శ్యామలా కృపారావ్,**
**టీచర్ మరియు గ్రాడ్యుయేట్, ఎ.జి జోన్**

# నవంబర్ '25 యెహెజ్కేలు గ్రంథము (17 - 18 అధ్యాయాలు)




**అడ్డం**

2. లేతకొమ్మల చిగుళ్లను త్రుంచి దానిని ఎక్కడ నాటెను?
4. అతడు ఎలాగు బ్రదుకును?
7. ఏమి భంగము చేసెను గనుక తప్పించుకొనడు?
8. వారు ఏమి దిద్దుకొని బ్రదుకుటయే నాకు సంతోషము?
9. కావున మీరు మనస్సు త్రిప్పుకొనుడి అప్పుడు మీరు ఏమి అగుదురు?
12. ఆలాగున ఆ ద్రాక్షచెట్టు ఎలాగు వర్ధిల్లి రెమ్మలు వేసెను?
13. ఎవరు మరణము నొందును?

**నిలువు**

1. దుష్టుని దుష్టత్వము ఎవరికి చెందును?
3. నీతిపరుని నీతి ఎవరికి చెందును?
4. నా మార్గము న్యాయమే కాని మీ మార్గము ఎటువంటిది?
5. నా జీవముతోడు ఆ దోషశిక్ష ఎక్కడ మోపుదును?
6. ఎవరు నా వశములో ఉన్నారు?
10. ఎవరు మరణము నొందుటచేత నాకు ఏ మాత్రమైన సంతోషము కలుగునా?
11. అతడు చేసిన అపరాధములలో ఒకటియు ఎందులోనికి రాదు?


– కె.కిరణ్ కుమార్,

స్టాఫ్, మహబూబ్‌నగర్


## అక్టోబర్ '25 యెహెజ్కేలు గ్రంథము (15 - 16 అధ్యాయాలు)

**అడ్డం:** 3. పట్టు, 4. నీజారత్వము, 6. సన్నమైనయెఱ్ఱని, 8. నాభిసూత్రము, 9. కఠినమైనది, 10. కనానీయులవి, 12. జీవనోపాధిని, 14. కిరీటమును

**నిలువు:** 1. కోపము, 2. యౌవన, 5. రక్తములో, 7. నిబంధనను, 8. నాదానవైతివి, 11. నీప్రవర్తన, 13. పాడుచేస్తాను

**విజేతలు:** 1. జ్యోతి గంగారాం, కొంపల్లి, 2. మేసు స్వప్న తుకారం, రాజన్న సిరిసిల్ల

# గతించిన గతం

అందరూ దారి తప్పినవారే
వక్రగతుల వారసులే
నిన్నటి దాకా నేనూ అంతే!
కానీ లోకమంతా
ప్రకటించనివ్వండి
ఇప్పుడు నేనో కడుగబడిన
పాపాన్ని!

ఎక్కడ చూసినా విషాదం
అలముకున్న అంధకారం
మంచి చెడుల మధ్య
తగ్గిపోతున్న దూరం
దీపస్తంభం మీదకి నన్ను
ఎక్కనివ్వండి
ఇప్పుడు నేనో వెలుగుతున్న దీపాన్ని

నా మార్గం అరణ్యం
ఎదురుగా ఎఱ్ఱ సముద్రం
కానీ నా గమ్యం ఓ అద్భుతమైన నగరం
నా సిలువ నెత్తుకొని నన్ను వెళ్ళనివ్వండి
ఇప్పుడు నేనో కరుణామయుని శిష్యుణ్ని!

– తాళ్ళూరి ప్రసాద్

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH

Edited, Printed and Published by Mr. Dasari Rajesh for UESI Publication Trust, Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village, Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Printed at SRI RR Offset printers, Azamabad, Hyderabad.
(For Private Circulation Only)